# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

24.04.2026 శుక్రవారం Frieday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 269 | పేజీలు : 13 Pages : 13 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



## రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


# అసలు సిసలు భగీరథ ప్రయత్నం!

రవీంద్రభారతిలో ఘనంగా భగీరథ మహర్షి జయంతి

అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే యువతకు స్ఫూర్తి

మంత్రి వాకిటి శ్రీహరి పిలుపు వివరాలు 2లో..






# ఆర్టీసీ సెగకు కేబినెట్ చెక్

హైదరాబాద్, ఏప్రిల్ 23 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం పలు సంచలన నిర్ణయాలకు వేదికైంది. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను తీర్చేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ ఉదారతను చాటుకున్నారు. తమ జీతాల నుంచి 50 శాతాన్ని కోత విధించుకుని ఆ నిధులను ఉద్యోగుల ప్రయోజనాల కోసం మళ్లించాలని కేబినెట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

మిగతా 2 లో

**రంగంలోకి 'పంచ పాండవులు'**

ఉద్యోగుల బకాయిల కోసం మంత్రుల త్యాగం

జీతాల్లో 50 శాతం కోతకు నిర్ణయం!

నేడే నిర్ణయాత్మక చర్చలు!

ఆత్మహత్యలు వద్దని సీఎం విజ్ఞప్తి



# సుప్రీంకోర్టుకు కాళేశ్వరం

- హైకోర్టు తీర్పుపై అప్పీలుకు సర్కార్ సిద్ధం
- త్వరలోనే ఎస్ఎల్‌పీ దాఖలుకు కసరత్తు
- కేసీఆర్, హరీశ్ రావుకు ఊరటపై సవాల్

2







## రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

ఎక్కడికక్కడే నిలిచిపోయిన బస్సులు

- బలవంతంగా నడిపేందుకు యత్నాలు
- పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

2

## ఇద్దరు డ్రైవర్ల సూసైడ్ అటెంప్ట్

వరంగల్, నల్లగొండ జిల్లాల్లో కలకలం

# శబరిమల కేసులో 'వాట్సాప్' సెటైర్లు

- మత విశ్వాసాలు రాజ్యాంగ నైతికతకు లోబడే ఉండాలి..
- 9 మంది సభ్యుల ధర్మాసనం స్పష్టం
- సోషల్ మీడియా సమాచారంపై సర్వోన్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు

4





## మేడ్ ఇన్ తెలంగాణ గ్లోబల్ బ్రాండ్!

ములుగులో బేకర్ హ్యూస్ తయారీ కేంద్రం ప్రారంభం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం

2

# నేటి నుంచే వేసవి సెలవులు!



- జూన్ 11 వరకు విద్యాసంస్థలకు వేసవి విరామం
- జూన్ 12న తిరిగి తెరుచుకోనున్న పాఠశాలలు
- ఆర్టీసీ సమ్మెతో నిలిచిన పల్లె పయనాలు

3

# సీఎం రేవంత్ మాట తప్పారు!

- ఆర్టీసీ సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు
- కేసీఆర్, రేవంత్ ఇద్దరూ ఒక్కటే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



3



# బీజేపీదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

4


# తమిళనాడు, బెంగాల్‌లో తొలిదశ పోలింగ్ ప్రశాంతం



- బెంగాల్‌లో 89.93 శాతం..
- తమిళనాడులో 82.24 శాతం
- మే 4న తుది ఫలితాలు

4

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి అంకం ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఈవీఎంలలో నిక్షిప్తమైంది.





# 11 మంది సజీవదహనం!

అదుపుతప్పిన ట్రక్కు.. ముక్కలైన వాహనాలు

ఎగిసిపడిన నిప్పురవ్వలు

4



# కాళేశ్వరంపై సుప్రీం కోర్టులో అప్పీల్

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్‌కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

# అసలు సిసలు భగీరథ ప్రయత్నం!

## రవీంద్రభారతిలో ఘనంగా భగీరథ మహర్షి జయంతి

## అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే యువతకు స్ఫూర్తి

## మంత్రి వాకిటి శ్రీహరి పిలుపు



**హైదరాబాద్, ఏప్రిల్ 23:** హైదరాబాద్ రవీంద్రభారతిలో శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటల రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. సగర సంఘం నాయకులు ఉప్పరి శేఖర్, ఆస్కాని మారుతీసగర తదితరులు హాజరై భగీరథుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. సగర సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటామని భరోసా ఇచ్చారు. కలియుగంలోనూ భగీరథుడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నామని వివరించారు. శివుడి తలలో బంధీగా ఉన్న గంగమ్మను దివి నుంచి భువికి తెచ్చిన మహానుభావుడు భగీరథుడని కొనియాడారు. భగీరథుడి పట్టుదలే నేటి సమాజానికి దిశానిర్దేశం చేస్తోందని పేర్కొన్నారు. బసవేశ్వరుడు 'కాయకమే కైలాసం' అని చెబితే.. అనుకున్న పని సాధించే వరకు ప్రయత్నం ఆపకూడదని భగీరథుడు నిరూపించారని మంత్రి గుర్తు చేశారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. భగీరథుడిని దిక్సూచిగా మార్చుకుని యువత పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని భగీరథుడి జీవితం మనకు నేర్పుతుందన్నారు.

# మేడ్ ఇన్ తెలంగాణ గ్లోబల్ బ్రాండ్!

## ములుగులో బేకర్ హ్యూస్ తయారీ కేంద్రం ప్రారంభం

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం




**గజ్వేల్, ఏప్రిల్ 23:** సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో 'ఆజాద్ – సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన ప్రముఖ ఇంధన సాంకేతిక సంస్థ 'బేకర్ హ్యూస్' కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లీన్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీని ఆయన ప్రారంభించారు. సుమారు 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అత్యాధునిక సాంకేతికతతో ఈ కేంద్రాన్ని నిర్మించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ బేకర్ హ్యూస్.. ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్, ఇండస్ట్రియల్ ఎనర్జీ టెక్నాలజీ, డిజిటల్ సొల్యూషన్స్ రంగాల్లో ప్రసిద్ధి చెందింది. ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో ఈ సంస్థ తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. తునికి బొల్లారంలో తాజాగా ప్రారంభమైన ఈ యూనిట్ లో పారిశ్రామిక ఇంధన అవసరాలకు కావాల్సిన హై ప్రిసిషన్ ఉత్పత్తులను తయారు చేస్తారు. దీనివల్ల తెలంగాణ పారిశ్రామిక రంగంలో కొత్త పుంతలు తొక్కనుంది.

### యువతకు భారీగా ఉపాధి అవకాశాలు

ఈ కొత్త తయారీ కేంద్రం ద్వారా సుమారు 230 మంది నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి లభించనుంది. తయారీ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ మరింత ప్రపంచవ్యాప్తం అవుతుందని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. అత్యాధునిక సాంకేతికతతో పనిచేసే ఈ కేంద్రం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ సంస్థలు తెలంగాణకు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

# ఆర్టీసీ సెగకు కేబినెట్ చెక్

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర కేబినెట్ భేటీ అనంతరం మంత్రుల బృందం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పాలకుల బాధ్యతను, ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటిచెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ "గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వెళ్ళింది. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన రూ. 8,000 కోట్ల బకాయిలను గాలికి వదిలేశారు. వారు ఆఫీసుల చుట్టూ, సచివాలయం చుట్టూ తిరగడం చూస్తుంటే బాధేస్తోంది. అందుకే ఒక కీలక నిర్ణయం తీసుకున్నాం. అవసరమైతే మా మంత్రులం, ఎమ్మెల్యేలం అందరం మా జీతాల్లో 50 శాతం కోత విధించుకుంటాం. ఆ డబ్బుతో రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు తీరుస్తాం. 100 రోజుల్లోగా ఈ బకాయిలన్నీ చెల్లించాలని అధికారులను ఆదేశించాం" అని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ "ఆర్టీసీ కార్మికులకు నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా.. దయచేసి ఎవరూ ఆవేశంలో ప్రాణాలు తీసుకోవద్దు. ఆత్మహత్యలు దేనికీ పరిష్కారం కావు. మీ సమస్యల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా సానుకూలంగా ఉన్నారు. అందుకే ఐదుగురు మంత్రుల కమిటీని వేశాం. రేపు (శుక్రవారం) డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలో మేము చర్చలు జరుపుతాం. మీ డిమాండ్లపై మనసు విప్పి మాట్లాడదాం, పరిష్కారం వెతుకుదాం" అని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ "కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో జరిగిన దోపిడీని మేం వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఇప్పటికే దీనిపై విచారణ జరుగుతోంది. అవసరమైతే సీబీఐ విచారణ కోసం కేంద్రాన్ని కోరుతాం. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే. అలాగే గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధికి టాటా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాం. రూ. 700 కోట్లతో అక్కడ అద్భుతమైన క్రీడా సౌకర్యాలు



రాబోతున్నాయి"అని చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ "తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిది. మీ హక్కులను కాపాడే బాధ్యత మాది. ప్రభుత్వానికి కాస్త సమయం ఇవ్వండి. అన్ని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం. అలాగే సహకార సంఘాల ఎన్నికలను త్వరలోనే నిర్వహిస్తాం. పారదర్శకమైన పాలన అందించడమే మా లక్ష్యం. ప్రభుత్వంపై నమ్మకం ఉంచండి" అని విజ్ఞప్తి చేశారు.

### ఆర్టీసీ సమ్మెపై సానుకూలత

రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఎవరూ ఆవేశానికి లోనై ప్రాణాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం దిశగా ఐదుగురు మంత్రులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ బృందం నేడు (శుక్రవారం) ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కార్మిక సంఘాలతో చర్చలు జరపనుంది. చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకుందామని, కార్మికులు సంయమనం పాటించాలని మంత్రులు కోరారు.

### ఉద్యోగుల బకాయిలకు చెక్

గత ప్రభుత్వం వదిలివెళ్లిన వేల కోట్ల రూపాయల ఉద్యోగ బకాయిలపై కేబినెట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు రూ. 8,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వచ్చే 100 రోజుల్లోగా పూర్తిగా చెల్లించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రెవెన్యూ రిసోర్సెస్ కమిటీని ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

### కాళేశ్వరంపై సీబీఐ విచారణ

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపించేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. న్యాయ నిపుణులతో సంప్రదించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు. అలాగే, రాష్ట్రంలో సహకార సంఘాల ఎన్నికలను త్వరలోనే నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. పీఏసీఎస్ చైర్మన్లను నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తామని ప్రకటించారు.

### గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధి

క్రీడా రంగానికి ఊతమిచ్చేలా గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధికి టాటా సంస్థ ముందుకు వచ్చినట్లు మంత్రులు వెల్లడించారు. సుమారు 76 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టేడియాన్ని రూ. 700 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలు, ఉద్యోగులు ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు.

# రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

## ఎక్కడికక్కడే నిలిచిపోయిన బస్సులు

## బలవంతంగా నడిపేందుకు యత్నాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబా బాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగుతుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఇద్దరు డ్రైవర్ల సూసైడ్ అటెంప్ట్

### వరంగల్, నల్లగొండ జిల్లాల్లో కలకలం





ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రాష్ట్రంలో పలుచోట్ల ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. నల్గొండ జిల్లా మిర్యాలగూడ డిపోలో డ్రైవర్ వెంకన్న పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. సమ్మెపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ చర్యకు దిగినట్లు సమాచారం. అయితే వెంటనే అప్రమత్తమైన తోటి ఉద్యోగులు ఆయనను అడ్డుకుని పెద్ద ప్రమాదం తప్పించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సంచలనం సృష్టించింది. ఓఉఓ వైద్యులు శంకర్‌గౌడ్ ఆరోగ్య పరిస్థితిపై తాజా వివరాలు వెల్లడించారు. ఆయనకు 60 నుంచి 80శాతం వరకు కాలిన గాయాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారని, పరిస్థితి నిలకడగా ఉన్నట్లు చెప్పారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను హైదరాబాద్‌కు తరలించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో వరుస ఘటనలు చోటు చేసుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన వాతావరణం నెలకొంది. దిలా ఉంటే, రాష్ట్రంలో ఖిఅ కార్మికుల సమ్మె కారణంగా రెండో రోజు కూడా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ఉద్యోగులు, దినసరి కూలీలు సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి రావడంతో ప్రయాణికులు అధిక ఛార్జీల భారాన్ని మోస్తున్నారు.

# ఎల్బీనగర్‌కు డబుల్ డెక్కర్ ధమాకా!

- 7.1 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్
- 15 నిమిషాల్లోనే నగరం దాటేలా ప్రణాళిక
- మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి సమీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు నిర్మించ తలపెట్టిన 7.1 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పనులపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి ప్రాజెక్టు పురోగతిని సుదీర్ఘంగా చర్చించారు. సీఎమ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. మొత్తం 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున 200 కోట్లు ఇచ్చేందుకు సీఎమ్ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుముఖత వ్యక్తం చేశారని మంత్రి తెలిపారు. నాగపూర్ తర్వాత దేశంలోనే ఇది రెండో అతిపెద్ద ప్రాజెక్టు అని ఆయన పేర్కొన్నారు. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే ఎల్బీనగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని.. హైదరాబాద్-విజయవాడ మార్గంలో ప్రయాణించే వారు కేవలం 15 నిమిషాల్లోనే నగరాన్ని దాటవచ్చని వివరించారు. ఎన్ హెచ్ 65 మార్గంలో నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ వల్ల



ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ కారిడార్ పూర్తయితే స్థానికులు సర్వీస్ రోడ్ల ద్వారా సులభంగా రాకపోకలు సాగించవచ్చని చెప్పారు. కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి, పైన మెట్రో రైలు నిర్మాణం ఉండేలా సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చించారు. నాణ్యతతో కూడిన పటిష్టమైన పిల్లర్లను నిర్మించాలని ఆదేశించారు. టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పనులు సమాంతరంగా సాగేలా ఒకే వర్క్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగిస్తే సమన్వయ లోపం ఉండదని అభిప్రాయపడ్డారు. అధికారులు తమ స్థాయిలో పనులు త్వరగా పూర్తి చేస్తే.. వచ్చే వారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి కారిడార్ పనులను తక్షణమే ప్రారంభించేలా విజ్ఞప్తి చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# నేటి నుంచే వేసవి సెలవులు!

- జూన్ 11 వరకు విద్యాసంస్థలకు వేసవి విరామం
- జూన్ 12న తిరిగి తెరుచుకోనున్న పాఠశాలలు
- ఆర్టీసీ సమ్మెతో నిలిచిన పల్లె పయనాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 23:** తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు నేటి నుంచే వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారంతో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగియగా.. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభమైంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు. కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియడంతో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలలో 'తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించింది. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది నేటి నుంచే ప్రారంభమైంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్ర నిరాశ ఎదురైంది. సమ్మె కారణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఊళ్లకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు తమ సొంత గ్రామాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

# ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులదే!

- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- ఆర్టీసీ కార్మికుల కు మద్దతు
- ప్రభుత్వం దిగిరాకుంటే సెక్రటేరియట్ ముట్టడి



**హైదరాబాద్, ఏప్రిల్ 23:** ఆర్టీసీ సమ్మెలో భాగంగా రెండో రోజు రాణిగంజ్ డిపో వద్ద కార్మికులతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధర్నాకు దిగారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిదని.. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి కూడా వారికే ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని, అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆ కృషితోనే తెలంగాణ సిద్ధించిందని.. ఆ విషయాన్ని ప్రభుత్వం మర్చిపోకూడదని సూచించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. కానీ ప్రభుత్వం మారడంతో అమలులో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను నియమించడాన్ని తలసాని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్టీసీ బస్సులు నడిపే అనుభవజ్ఞులైన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సులు నడపడం రాదా అని ప్రశ్నించారు. ఇది సంస్థను ప్రైవేటుపరం చేసే కుట్ర అని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరిస్తే కార్మికులు సమ్మె ఎందుకు చేస్తారని నిలదీశారు. సమ్మె చేస్తున్న వారిని ఎండీ భయపెట్టడం సరికాదని.. అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దామని పిలుపునిచ్చారు. కేబినెట్ సమావేశం ముగిసిన వెంటనే ఆర్టీసీ జేఏసీ నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలవాలని తలసాని డిమాండ్ చేశారు. తూతూ మంత్రంగా కాకుండా 29 డిమాండ్లపై పూర్తి స్పష్టత ఇవ్వాలని కోరారు. ఆ డిమాండ్లు ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల వెనుక కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మొత్తం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. తాండూరులో కార్మికుల టెంట్లకు పోలీసులు అడ్డుపడటంపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టు అని తలసాని అన్నారు. మేధా పర్వతం లాంటి కేసీఆర్ పై ఉమ్మేస్తే అది కాంగ్రెస్ నాయకులపైనే పడిందని ఎద్దేవా చేశారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తూ రికార్డు స్థాయిలో వరి ధాన్యం పండించిన ప్రాజెక్టును అవినీతిమయం అనడం సరికాదన్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే లక్ష కోట్ల అవినీతి అంటూ దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా కక్షసాధింపులు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కే కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.

# నకిలీ ఐస్‌క్రీమ్ అమ్మితే 5వేల ఫైన్!

హంగార్గా గ్రామ కూడలిలో ఫ్లెక్సీ ఏర్పాటు

పిల్లల ఆరోగ్యం కోసం గ్రామస్తుల కీలక నిర్ణయం





**నిజామాబాద్, ఏప్రిల్ 23:** తమ గ్రామంలో నాసిరకం ఐస్‌క్రీమ్ విక్రయిస్తే భారీ జరిమానా విధిస్తామని నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హంగార్గా గ్రామస్తులు, సర్పంచ్ హెచ్చరించారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లే ప్రధాన కూడలి వద్ద హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గ్రామస్తులందరూ ఏకగ్రీవంగా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సర్పంచ్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ.. బయటి నుంచి వచ్చే తోపుడు బండ్లలో నాణ్యత లేని, రంగులు, రసాయనాలు కలిపిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నారని తెలిపారు. వీటిని తినడం వల్ల చిన్న పిల్లలకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకే గ్రామంలోకి ఇలాంటి వాటిని అనుమతించబోమని.. ఒకవేళ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు జరిపితే రూ.5 వేల జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ఐస్‌క్రీమ్‌తో పాటు నాసిరకం చిప్స్ ప్యాకెట్లు, జంక్ ఫుడ్స్ విక్రయాలపైనా నిషేధం విధిస్తున్నట్లు గ్రామ కమిటీ ప్రకటించింది. అనంతరం శివాజీ చౌక్ వద్ద ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపి, గ్రామ కార్యదర్శి గంగారాం, భజరాం, గోవింద్, ఉమ్మర్, జీవన్ పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల్లో బోగస్ తొలగింపు

ఈ-కేవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోంది. ఇందులో భాగంగా, రేషన్ కార్డు వినియోగదారులందరికీ ఈ-కేవైసీ' ప్రక్రియను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. గతంలో రేషన్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి, అనర్హులను తొలగించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. చాలా మంది లబ్ధిదారులు తమ కార్డులలో వివరాలను అప్‌డేట్ చేయకపోవడం వల్ల రేషన్ నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే లక్షలాది కార్డులు నిబంధనలు పాటించని కారణంగా రద్దు చేశారు. కాబట్టి, ప్రభుత్వం అందించే ఉచిత లేదా రాయితీ బియ్యం, ఇతర సరుకులను నిరంతరాయంగా పొందాలంటే.. ప్రతి కార్డుదారుడు తమ ఆధార్ వివరాలను రేషన్ కార్డుతో అనుసంధానించి.. వేలిముద్రల ద్వారా ధృవీకరణ పూర్తి చేసుకోవడం అత్యవసరం. రేషన్ కార్డులో పేరున్న ప్రతి వ్యక్తి బ్రతికే ఉన్నారా లేదా? ఒకే వ్యక్తికి రెండు చోట్ల కార్డులు ఉన్నాయా? అనే విషయాలను నిర్ధారించుకోవడానికి ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. ఇది పారదర్శకతను పెంచుతుంది. కార్డుదారులు తమ సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి, అక్కడి డీలర్ వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రం ద్వారా తమ వేలిముద్రలను వేయాలి. దీనినే బయోమెట్రిక్ అథెంటికేషన్ అంటారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారి పేర్లను కార్డు నుంచి తొలగించే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో మొత్తం కార్డునే రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ-కేవైసీ అప్‌డేట్ చేయని కారణంతో దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బోగస్ కార్డులను అధికారులు గుర్తించి తొలగించారు. వి హా ం ు ప్రస్తుతం మీ ఊరిలో లేకపోయినా,




'వన్ నేషన్ ? వన్ రేషన్ కార్డ్' పథకం ద్వారా మీరు ఉన్న చోటే దగ్గరలోని రేషన్ షాపులో కేవైసీ పూర్తి చేసుకునే వెసులుబాటు ఉంది. ఇప్పటికీ చాలా మంది రేషన్ కార్డుదారులు తమ ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయలేదని.. వారు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం కోరుతోంది. దీంతో పాటు.. వరుసగా మూడు నెలల కంటే ఎక్కువ నెలలు ఆ రేషన్ కార్డు ద్వారా ఎలాంటి రేషన్ తీసుకోకపోతే.. ఆ కార్డులు కూడా రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలా రద్దైన కార్డులు కూడా దేశ వ్యాప్తంగా చాలా ఉన్నాయి.



# రేవంత్ మాట తప్పారు!

ఆర్‌టీసీ సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు

కేసీఆర్, రేవంత్ ఇద్దరూ ఒక్కటే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఒక్కటేనని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్‌టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఆర్‌టీసీ కార్మికుల సమ్మెపై ఆయన గురువారం తీవ్రంగా స్పందించారు. అసలు సమస్యలను పక్కన పెట్టి కేబినెట్ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రామచందర్ రావు మండిపడ్డారు. గతంలో పీఆర్‌సీ విషయంలో కేసీఆర్ మాట ఇచ్చి తప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్‌టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని.. ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీజేపీ కార్యకర్తలు కార్మికులకు అండగా ఉంటారని రామచందర్ రావు వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే కార్మికులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే బీజేపీ తరఫున ప్రత్యక్ష ఆందోళనల్లో పాల్గొంటామని హెచ్చరించారు. శుక్రవారమే ప్రభుత్వం కార్మికులను చర్చలకు పిలవాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు.

# రాహుల్‌తో పీసీసీ చీఫ్ భేటీ

రాష్ట్రంలో తాజా రాజకీయాలపై వివరణ

పార్టీ సంస్థాగత నిర్మాణంపైనా చర్చ

నామినేటెడ్ పదవులు, బీసీ కులగణనపై ప్రస్తావన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాహుల్‌కు టీపీసీసీ చీఫ్ వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. కాంగ్రెస్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు, డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీల నియామకాలను రాహుల్‌కు వివరించారు. తెలంగాణలో కులగణన సమాచారాన్ని ప్రకటించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ రిజర్లేషన్లనూ జోడించాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరారు. ఈ విజ్ఞప్తులకు రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి బృందం నేడు ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసింది. ఈ బృందంలో రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ నేత వి. హనుమంతరావు కూడా ఉన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరుపై ఈ సందర్భంగా కీలక చర్చలు జరిగాయి. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు ప్రజల్లోకి ఏ మేరకు వెళ్తున్నాయనే అంశంపై రాహుల్ ఆరా తీసినట్టు సమాచారం. ముఖ్యంగా సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే దిశగా మహేష్ కుమార్ గౌడ్ రాహుల్‌కు వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ భేటీలో బీసీ జనగణన ప్రధానాంశంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. 'బీసీ గణన చేస్తామని ప్రధాని మోదీ చెప్పారు, కానీ అది క్షేత్రస్థాయిలో అమలు కావాలి' అని రాహుల్ పేర్కొన్నట్టు సమాచారం. బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌ను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. తెలంగాణలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తీపి కబురు అందిస్తూ మహేష్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టులను మే నెలలోగా భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించి ఇప్పటికే కసరత్తు పూర్తయిందని, త్వరలోనే తుది నిర్ణయం వెలువడుతుందని తెలిపారు. రాహుల్ గాంధీతో భేటీ అత్యంత సంతృప్తికరంగా సాగిందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి రాహుల్ కొన్ని సూచనలు చేశారని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. వచ్చే ఎన్నికల దృష్ట్యా పార్టీ కేడర్‌ను సిద్ధం చేయడమే తమ తక్షణ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# పెద్ద ఎత్తు కల్తీ టీపొడి విక్రయం

**హైదరాబాద్, ఏప్రిల్ 23:** హైదరాబాద్ నగరంలో టీ ప్రియుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాసులు కురిపించుకుంటున్న ఒక ముఠాను పోలీసులు ఆట కట్టించారు. నకిలీ టీ అమ్ముతున్న ముటాను పట్టుకున్నారు. సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్, దానికి సంబంధించిన రసాయనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా హోటళ్లు, టీ స్టాళ్లలో వాడి పారేసిన టీ పొడిని సేకరించి, దానికి హానికరమైన రంగులు, కృత్రిమ వాసనలు కలిపి తిరిగి ప్యాక్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ దందాపై గత కొన్ని రోజులుగా నిఘా పెట్టిన పోలీసులు, అత్యంత గోప్యంగా ఆపరేషన్ నిర్వహించి కల్తీ కేంద్రాలపై దాడి చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కల్తీ టీ పొడిని తయారు చేసేవారితో పాటు, తక్కువ ధరకు వస్తుందని తెలిసి కూడా దీన్ని కొనుగోలు చేస్తున్న కొంతమంది టీ షాప్ ఓనర్లు కూడా ఉన్నట్లు సమాచారం.



## సంపాదకీయం

# ప్రగతి చక్రంపై నిర్లక్ష్యపు నీడ !

అధికారంలోకి రావడానికి అనేక హామీలు గుప్పించడం, తరవాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది. అలవికాని హామీలు ఇవ్వడం, ప్రజలను మోసం చేయడం అలవాటు చేసుకున్నారు. బిఆర్ఎస్ బాటలోనే ఇప్పుడు కాంగ్రెస్ కూడా మోసాల దారిలో నడుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిల పడింది.రాష్ట్ర ఆదాయం మొత్తాన్ని వడ్డీలు కట్టడానికే అన్నట్లుగా అప్పులు చేసి చూపారు. అప్పులతో తెలంగాణ చితికి పోతోంది. ఇందులో అన్ని పార్టీలతది ఒకటే దారిగా ఉంది. తెలంగాణ ఏర్పడ్డాక కెసిఆర్ ప్రభుత్వ హాయంలో ఆర్టీసి దాదాపు రెండునెలల పాటు సమ్మెకు దిగింది. వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని ఆనాడు కెసిఆర్, ఈనాడు రేవంత్ రెడ్డి ఇద్దరూ నిలబెట్టుకోలేక పోయారు. దూరదృష్టి లేక రవాణా శాఖ.. సమ్మెకు కారణమయ్యారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, వేతన సవరణ, బకాయిల చెల్లింపు సహా మొత్తం 32 అంశాలపై కార్మిక సంఘాల జేఏసీ ఏడాది కాలంగా ప్రభుత్వ పెద్దలకు, ఆర్టీసీ యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చింది.. విజ్ఞాపనలు చేసింది. సమ్మెకు వేళయిన తరుణంలో మంగళవారం ఆగమేఘాలపై అధికారుల కమిటీ పేరుతో ప్రభుత్వం ఓ కంటి తుడుపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఏడాదిగా పట్టింపులేనితనం ప్రదర్శించి, ఇప్పుడు నాలుగు వారాల గడువు కోరటం విడ్డూరం.ఇలాంటి కాలయాపన కమిటీతో ఒరిగేదేమీ లేదని భావించిన కార్మికులు, సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పి, మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు చక్రాలు ఆగిపోయాయి. 6,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రతి రోజూ 60 లక్షల మంది ప్రయాణించే ఆర్టీసీలో సమ్మెతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతుంటే ప్రైవేటు వాహనాలు అందుబాటులో లేక ప్రయాణాలు ప్రయాసగా మారాయి. విద్యార్థులు, రోజువారీ, కూలీలు, ఉద్యోగులు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రజా రవాణాను ఆశ్రయించే ఇతర ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిపోల వద్ద కార్మికుల ధర్నాలు, పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ నష్టాల్లో సాగుతోంది. ఆర్టీసీ కార్మికులను ఒప్పించలేక, మెప్పించలేక చతికిలపడిన తీరు రేవంత్ సర్కార్ అసమర్ధతకు నిదర్శనంగా చూడాలి. మాటలు, ఆవేశంతో కూడిన ప్రసంగాలతో ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని అధికార కాంగ్రెస్ నేతలు గుర్తించాలి. నిత్యం అరకోటి మందికి పైగా ప్రయాణించే ప్రజారవాణా వ్యవస్థలో సమస్యల పరిష్కారం చూపడంలో రెండున్నరేళ్లుగా నిర్లక్ష్యం వహించారు. ప్రభుత్వం ఇంకా దాటవేత ధోరణి అవలంబించి సమస్యను జటిలం చేయకుండా సమ్మెకు కారణాలను గుర్తించి పరిష్కరించాలి. ఆర్టీసీ కార్మికుల,రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా సమ్మెకు సత్వరమే పరిష్కారం కనుగొనాలి. ఈ దిశగా సర్కార్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎన్నికల్లో డిక్లరేషన్లు, మ్యానిఫెస్టోలో హామీలు గుప్పించి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన హస్తం నేతలు పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు. ఇప్పుడు ప్రజా రవాణా వ్యవస్థ కూడా ఆ జాబితాలో చేరిపోయింది. హామీల అమలు, సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సమ్మెబాట పట్టాయి. అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పుడు మరచిపోయి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసం ప్రణాళికను ప్రకటించినా ఆచరణలో పెట్టలేకపోయింది. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు పీఆర్సీ పరిధిలోకి తీసుకొస్తామని, ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని, ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీల మీద హామీలు గుప్పించింది. దీంతో ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ మాటలనునమ్మారు. రెండున్నరేండ్లు గడిచినా కాంగ్రెస్ సర్కార్ ఆర్టీసీ గురించి పట్టించుకోవట్లేదు. ఆరు గ్యారెంటీల్లోని ఒక గ్యారెంటీ అయిన మహాలక్ష్మి పథకంలో ఒక భాగమైన 'మహిళలకు ఆర్టీసీలో బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం' తీసుకొచ్చింది. కానీ ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు ఇవ్వటంలేదు. ఇప్పుడు కార్మిక సంఘాల జేఏసీ అడుగుతున్న డిమాండ్లలో ఫ్రీ బస్ పథకం నిధుల విడుదల అంశం కీలకమైనది కావడం గమనార్హం. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ లాభాల్లోకి దూసుకెళ్లిందని చెప్పుకొంటున్న ప్రభుత్వ పెద్దలు.. కార్మికుల సమస్యలు ఎందుకు పరిష్కరించటంలేదో చెప్పాలి. ఇకపోతే ఎన్నికల ముందు కాంగ్రెస్ నిరుద్యోగ మ్యానిఫెస్టోను ప్రకటించింది. తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని చిక్కడపల్లి లైబ్రరీకి తీసుకువచ్చి నిరుద్యోగుల్లో ఆశలు పెంచింది. ప్రియాంక గాంధీతో సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించి నిరుద్యోగులను తమ వైపు తిప్పుకున్నది. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల్లో ఆశలు కల్పించారు. అది నిజమని నమ్మిన ఎంతోమంది బస్సు యాత్రలు నిర్వహించి ఆ పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయడమే కాదు, ఏకంగా పత్తి చేలు, వ్యవసాయ బావుల వద్ద కూలీలు, రైతులను కలిసి, కాళ్లు మొక్కి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించేలా తమ వంతు ప్రయత్నించారు. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగమూ రాలేదు. ఇలా అనేక హామీలను ఇచ్చి, వాటిని మరిచారు. ఇప్పుడు గత ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప రెండున్నరేళ్లుగా గట్టిగా చేసిన కార్యక్రమం ఒక్కటీ లేదు. హామీల అమలులో నిజాయితీ లేకుంటా గత బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది. పదేళ్లపాటు అధికారంలో ఉంటామన్న భరోసాకు ప్రజలు చెల్లచీటీ పలుకుతారని గుర్తించాలి.

# తమిళనాడు, బెంగాల్‌లో తొలిదశ పోలింగ్ ప్రశాంతం



- బెంగాల్‌లో 89.93 శాతం..
- తమిళనాడులో 82.24 శాతం ఓటింగ్
- మే 4న తుది ఫలితాలు

**చెన్నై/కోల్‌కతా, ఏప్రిల్23:** దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారిన తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి అంకం ముగిసింది. అంచనాలను మించి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో అటు దక్షిణాదిలోనూ, ఇటు తూర్పు భారత్‌లోనూ ఓట్ల వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న ఓటర్లకు పోలింగ్ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించగా, రాత్రి పొద్దుపోయే వరకు కూడా పలు కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ భారీ పోలింగ్ శాతం ఎవరికి పట్టం కట్టబోతోందన్న ఉత్కంఠ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలైంది. పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ సరళిని గమనిస్తే ఓటరు నాడి స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలోని మొత్తం 294 స్థానాలకు గానూ, తొలి విడతలో 152 సీట్లకు జరిగిన ఎన్నికల్లో సాయంత్రం 5 గంటలకే రికార్డు స్థాయిలో 89.93 శాతం పోలింగ్ నమోదైంది. బెంగాల్ రాజకీయ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలవనుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు కూడా సామాన్యులతో కలిసి క్యూలైన్లలో నిలబడి ఓటు వేయడం విశేషం. మరోవైపు తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించారు. అక్కడ కూడా ఓటర్ల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. సాయంత్రం 5 గంటల సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 82.24 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. చెన్నై నుంచి కన్యాకుమారి వరకు ఓటర్లు భారీగా తరలివచ్చి ప్రజాస్వామ్య పండుగలో పాల్గొన్నారు. ఎన్నికల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రక్రియను సజావుగా పూర్తి చేశారు. ఈ రెండు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన మే 4, 2026 (సోమవారం)న వెలువడనుంది.

# బెంగాల్‌ల్లో బీజేపీదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ




**కోల్‌కతా, ఏప్రిల్ 23:** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్‌లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా క్రితీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

# మీర్జాపూర్‌లో ఘోర ప్రమాదం: 11 మంది సజీవదహనం!

**అదుపుతప్పిన ట్రక్కు.. ముక్కలైన వాహనాలు**

**ఎగిసిపడిన నిప్పురవ్వలు**

**లక్నో, ఏప్రిల్ 23:** ఉత్తర్‌ప్రదేశ్ లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.



# శబరిమల కేసులో 'వాట్సాప్' సెటైర్లు

- జస్టిస్ నాగరత్న కీలక వ్యాఖ్యలు!
- మత విశ్వాసాలు రాజ్యాంగ నైతికతకు లోబడే ఉండాలి..
- 9 మంది సభ్యుల ధర్మాసనం స్పష్టం
- సోషల్ మీడియా సమాచారంపై సర్వోన్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్23:** దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠ రేపుతున్న శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టులో గురువారం కీలక విచారణ జరిగింది. తొమ్మిది మంది సభ్యుల సుదీర్ఘ ధర్మాసనం ముందు వాడివేడి వాదనలు కొనసాగుతుండగా, న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఆధునిక కాలంలో సమాచార వ్యవస్థ ఏ విధంగా తప్పుదోవ పట్టిస్తోందో వివరిస్తూ ఆమె వేసిన 'వాట్సాప్ యూనివర్సిటీ' సెటైర్లు కోర్టు హాల్లో నవ్వులు పూయించడమే కాకుండా, ఆలోచింపజేశాయి. విచారణ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ.. జ్ఞానం ఏ మూల నుంచి వచ్చినా, ఏ విశ్వవిద్యాలయం నుంచి వచ్చినా దానిని ఆహ్వానించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26లను ఉటంకించారు. దీనిపై జస్టిస్ నాగరత్న వెంటనే స్పందిస్తూ.. "ఏ విశ్వవిద్యాలయం నుంచి వచ్చినా పరవాలేదు కానీ, వాట్సాప్ యూనివర్సిటీ నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రం కాదు" అంటూ చమత్కరించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియాలో విచ్చలవిడిగా ప్రబలుతున్న తప్పుడు సమాచారాన్ని కోర్టులు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకూడదనే ఉద్దేశంతో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. వాదనల క్రమంలో మతపరమైన ప్రాథమిక హక్కుల అంశం తెరపైకి రాగా, సామాజిక సంస్కరణల పేరుతో ఈ హక్కులను కాలరాయలేమని న్యాయవాది కౌల్ వాదించారు. రాజ్యాంగ నైతికత అనేది ఒక అస్పష్టమైన పదమని, దానితో మత విశ్వాసాలను కొలవలేమని దావూదీ బోహ్రా వర్గం తరపు న్యాయవాది అభిప్రాయపడ్డారు. అయితే, దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. మతపరమైన హక్కులు అనేవి ఎప్పుడూ వ్యక్తిగత స్వేచ్ఛకు మాత్రమే పరిమితం కావని, అవి దేశ నైతికత, ప్రజారోగ్యం మరియు శాంతిభద్రతలకు లోబడే ఉండాలని జస్టిస్ నాగరత్న గుర్తుచేశారు. రాజ్యాంగ పరిధిని దాటి మత విశ్వాసాలు ఉండవనే సంకేతాన్ని ఈ విచారణ ద్వారా సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది.

నేటి సాక్షి
కరీంనగర్ | శుక్రవారం 24 ఏప్రిల్ 2026

# కథలాపూర్'లో ఇంటర్ టాపర్లకు సన్మానం





- ప్రతిభకు బీజేపీ యువమోర్చా ప్రోత్సాహం
- యువతలో విద్యా స్ఫూర్తి నింపేలా ప్రతిభ పురస్కారాల ప్రదానం
- మండల అధ్యక్షులు ఆరె శివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థుల విజయోత్సవ వేడుక

**నేటి సాక్షి, కథలాపూర్ (రాధారపు నర్సయ్య):** విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారి కృషిని సమాజం ముందుంచితే.. మరింత మంది యువతకు స్ఫూర్తి కలుగుతుందనే సంకల్పంతో భారతీయ జనతా యువమోర్చా మండల అధ్యక్షులు ఆరె శివకుమార్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణనిచ్చేలా జరిగింది. విద్యార్థులు కష్టపడి సాధించిన విజయాన్ని గుర్తించడం సమాజ బాధ్యత అని భావించిన భారతీయ జనతా యువమోర్చా నాయకత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించి తమ కుటుంబాలకు, ఉపాధ్యాయులకు, ప్రాంతానికి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను వేదికపైకి ఆహ్వానించి ప్రతిభ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సన్మానం అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ కృషిని గుర్తించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భారత దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, ప్రతిభకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని అన్నారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం క్రమశిక్షణతో చదువుకుంటూ ముందుకు సాగాలని, ఇలాంటి సన్మానాలు మరింత ఉత్సాహాన్ని నింపుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మల్యాల మారుతి పాల్గొని విద్యార్థులను అభినందించారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజంలో విద్యాపట్ల మరింత చైతన్యం పెరుగుతుందని, ఇలాంటి కార్యక్రమాలు యువతలో స్ఫూర్తిని నింపుతాయని పలువురు అభిప్రాయపడ్డారు. భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులకు గుర్తుండిపోయే మధురస్మృతిగా నిలిచింది. అదేవిధంగా బీజేపీ సీనియర్ నాయకులు జిల్లా సత్యం, కల్లెడ ప్రసాద్, నారాయణ, బొమ్మ మధు కూడా కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. యువమోర్చా నాయకులు కాసోజీ ప్రతాప్, సునీల్, అనిల్ రెడ్డి, వెంకటేష్, కిషోర్, శ్రీకర్, అనుదీప్, గణేష్, నవీన్, అఖిల్ లు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**నేటి సాక్షి, ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయపట్నం గోదావరి బ్రిడ్జ్ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు స్థానిక ఎస్సై తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30-35 సంవత్సరాలుగా అంచనా ఉంటుందని, మృతుడి ఎడమ చేతిపై రాజు బాయి అనే పచ్చబొట్టు ఉందని అన్నారు. మృతుడు నల్ల రంగు షర్ట్ మరియు నీలం రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఈ వివరాలకు సరిపోలే విధంగా ఎవరైనా గల్లంతైన వ్యక్తుల సమాచారం ఉంటే ధర్మపురి ఎస్సైని సంప్రదించలని కోరారు.

# అదనపు ఎస్పీగా చేతన్ నితిన్

## బాధ్యతలు స్వీకరించి ఎస్పీని కలిసిన అదనపు ఎస్పీ



**నేటి సాక్షి, జగిత్యాల,(పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా చేతన్ నితిన్ ను ప్రభుత్వం నియామకం చేసింది. బదిలీపై వచ్చిన చేతన్ నితిన్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను ను అందజేశారు. చేతన్ నితిన్ ఐపిఎస్ 2022 బ్యాచ్‌కు చెందిన అధికారి. గతంలో జనగామ ఏఎస్పి గా విధులు నిర్వర్తించగా ప్రస్తుతం జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు.

# వాసవి మాత జయంతి

## అధికారికంగా ప్రకటించడం హర్షనీయం



**నేటి సాక్షి, పరిగి(సురేష్ మోత్కూర్):** ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి మాత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం ఎంతో హర్షనీయమైన విషయమని, వికారాబాద్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు పాలాది శ్రీనివాస్ అన్నారు. గురువారం నాడు ఆయన మాట్లాడుతూ..... కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏర్పాటు చేశారని, అదేవిధంగా శ్రీ వాసవి మాత జయంతిని ప్రభుత్వ లాంఛనాల ప్రకారం అమ్మవారి జయంతిని నిర్వహించేందుకు అధికారిక ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అందుకు సహకరించి, ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తున్న పరిగి ఎమ్మెల్యే ప్రియతమ నాయకులు డాక్టర్ టీ. రామ్మోహన్ రెడ్డికి రాష్ట్ర ఆర్యవైశ్యుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్యవైశ్యులంతా ఎల్లప్పుడూ కాంగ్రెస్ వైపే ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైశ్యులకు ఎన్నో సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు..

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం




- ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి
- అహ్మదీపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వడ్లకు రూ.500 బోనస్ - పొద్దుతిరుగుడుకు రూ.7,721 మద్దతు ధర

**నేటి సాక్షి గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన ధ్యేయంగా పెట్టుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులు తమ పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి పూర్తి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా పొందాలని సూచించారు. రైతులు పండించిన వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ అందజేస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే తూకం, నాణ్యత పరీక్షలు పారదర్శకంగా నిర్వహించి, రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా గజ్వేల్ మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు విత్తనాలకు రూ.7,721 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. రైతులు పంటను మార్కెట్‌కు తీసుకొచ్చే సమయంలో తేమ శాతం, శుభ్రత ప్రమాణాలు పాటించి తీసుకొస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు జరుగుతుందని ఆమె వివరించారు. రైతులకు అవసరమైన గన్నీ బ్యాగులు, తూకం ఏర్పాట్లు, రవాణా వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ "రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. గత పాలనలో రైతులు పంటలు తీసుకొస్తే వరేస్తే ఊరే అన్న పరిస్థితి నెలకొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అండగా నిలుస్తోంది" అని అన్నారు. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి పెద్ద ఊరట కల్పించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న రైతు అనుకూల నిర్ణయాలతో వ్యవసాయం మరింత లాభసాటిగా మారుతుందని, రైతులు ఎలాంటి సందేహాలు ఉన్నా కొనుగోలు కేంద్ర సిబ్బందిని సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు. కొనుగోలు ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెద్దిరెడ్డి అశోక్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బ్యాగరి ప్రభాకర్ కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామ పెద్దలు, సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# శంకర్‌పల్లి డబుల్ బెడ్రూమ్ ఇండ్లు నిరుపేదలకి మాత్రమే

## జనసేన నాయకుడు సాయికుమార్ గౌడ్



**నేటి సాక్షి శంకర్‌పల్లి, (సుధాకర్ గౌడ్):** శంకర్ పల్లి జనసేన పార్టీ తరపున సాయికుమార్ గౌడ్, పార్టీ కార్యకర్తలు వేసిన డబుల్ బెడ్రూమ్ కేటాయింపు పై ఆర్ టిఐ వేసిన విషయం తెలుసుకున్న శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని దాదాపు 15 మంది స్వంత ఇంటి కల కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల వారు, గురువారం జనసేన పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో సాయికుమార్ గౌడ్ ని కలిసి తమ గోడుని చెప్పుకుంటూ బోరున విలపించారు. ఆ కుటుంబాల వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గుర్తుకు వచ్చే నిరుపేద ఓటరు, అదే గెలిచిన రాజకీయ నాయకుడికి ఎందుకు గుర్తుండటం లేదని, మేము చనిపోతే మమ్మల్ని కిరాయి ఇంటి వారు కూడా అనుమతించని దౌర్భాగ్యంలో బతుకుతున్నామని విలపించారు. ఆ కుటుంబాలకి న్యాయం జరిగే వరకు, అనర్హులకి కేటాయించిన డబుల్ బెడ్రూమ్ కేటాయింపుపై పూర్తి పోరాటం చేస్తామని, అర్హులైన వారికి అండగా జనసేన పార్టీ ఉంటుందని, ఆ పోరాటం ఎంత వరకైనా సాగిస్తామని సాయికుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. త్వరలోనే తమ పూర్తి కార్యచరణ సామాన్య ప్రజలకి చేరువయ్యేలా ప్రకటిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు దివాకర్, తెలుగు సాయి పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై దుష్ప్రచారానికి హైకోర్టు చెక్

- కేసీఆర్ నాయకత్వానికి క్లీన్ చీట్.. కమిషన్ నివేదిక చెల్లదన్న కోర్టు తీర్పు చారిత్రాత్మకం
- ప్రజలను మభ్యపెట్టిన కుట్రలపై న్యాయస్థానం గట్టి దెబ్బ: కవిత మాలోత్



**నేటి సాక్షి,మహబూబాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాష్ట్రానికే కాకుండా, ముఖ్యంగా రైతాంగానికి దక్కిన గొప్ప విజయమని మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు, భారాస జిల్లా అధ్యక్షురాలు కవిత మాలోత్ అభివర్ణించారు. ఈ తీర్పుతో కాంగ్రెస్ మరియు బీజేపీలు గత కొంతకాలంగా చేస్తున్న తప్పుడు ఆరోపణలు తుడిచిపెట్టుకుపోయాయని ఆమె స్పష్టం చేశారు. గురువారం మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత మాలోత్ మాట్లాడుతూ.. పి.సి. ఘోష్ కమిషన్ పేరుతో రాజకీయ ఒత్తిళ్లకు లోనై రూపొందించిన నివేదిక చెల్లదని కోర్టు స్పష్టమైన తీర్పునివ్వడం నిజాయితీకి దక్కిన విజయమన్నారు. కేసీఆర్ మీద ఉన్న రాజకీయ అక్కసుతో ప్రాజెక్టు ప్రతిష్టను దెబ్బతీయాలని చూసిన కాంగ్రెస్ కుట్రలు హైకోర్టు తీర్పుతో బట్టబయలయ్యాయని మండిపడ్డారు. లక్షల కోట్ల అవినీతి జరిగిందని ప్రజలను మభ్యపెట్టిన వారిపై కోర్టు తీర్పు ఒక గట్టి దెబ్బ అని ఆమె పేర్కొన్నారు. అత్యంత వేగంగా, దృఢ సంకల్పంతో ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు అండగా నిలిచిన కేసీఆర్ గారి కృషీఫలితమే నేడు పారుతున్న నీరు అని, ఆ నీళ్లు ఉన్నంత కాలం ఆయన పేరు చిరస్మరణీయంగా ఉంటుందని తెలిపారు. ఈ తీర్పు కేసీఆర్ నాయకత్వానికి క్లీన్ చీట్ ఇచ్చినట్టేనని ఆమె అభిప్రాయపడ్డారు. న్యాయం తమ వైపే నిలిచిందని, వాస్తవాలను పక్కనపెట్టి తప్పుడు ఆరోపణలు చేసిన వారికి ఈ తీర్పు ఒక గుణపాఠమని కవిత మాలోత్ అన్నారు. ఈ చారిత్రాత్మక తీర్పును మరియు అసలైన నిజాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత భారాస నాయకులు, కార్యకర్తలపై ఉందని ఆమె పిలుపునిచ్చారు. నిరంతరం తెలంగాణ అభివృద్ధి కోసం తపించే తమ పార్టీకి ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు



**నేటి సాక్షి గన్నేరువరం, ( బుర్ర అంజయ్య గౌడ్ ):** మండలంలోని మైలారం, సాంబయ్య పల్లి, కాసింపేట, గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఆయా గ్రామ సర్పంచ్లు ప్రారంభించడం జరిగింది. మైలారం గ్రామంలో గాలి పెల్లి పోచమ్మ ప్రారంభించారు సాంబయ్య పల్లెలో గడ్డం రమ్య ఉదయ్ రెడ్డిలు ప్రారంభించారు గ్రామంలో చంద్రయ్య ప్రారంభించారు సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు(వివో) అధ్యక్షులు మార్కెటింగ్ కమిటీ మెంబర్స్ వడ్నాల నరసయ్య మైసంపల్లి తిరుపతి సిబ్బంది రైతులు మరియు హమాలీలు పాల్గొన్నారు

# జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం



- మృతురాలి బంగారు కమ్మలు ఆసుపత్రి సిబ్బంది మాయం
- బంగారు కమ్మలు ఇవ్వాలని బాధితుల ఆందోళన

**నేటి సాక్షి, జగిత్యాల(పూరెళ్ల బాపు):** జగిత్యాలలోని ప్రభుత్వ క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో దారుణం జరిగింది. మృతురాలి బంగారు చెవి కమ్మలు ఆసుపత్రి సిబ్బంది మాయం చేశారని భాధితులు ఆరోపించారు. గురువారం ఆసుపత్రిలో బంగారు కమ్మలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాధితులు ఆందోళన చేయగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. జగిత్యాల పట్టణ పోలీసులు రంగప్రవేశం చేసి శాంతింపజేశారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం జగిత్యాల ప్రభుత్వ క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు గురువారం మృతి చెందగా కుటుంబ సభ్యులు అంబులెన్స్ లో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. అయితే మృతురాలికి చెందిన బంగారు చెవి కమ్మలు కనబడపోయేసరికి బాధితులు జగిత్యాల ఆసుపత్రికి చేరుకుని, బంగారం ఆసుపత్రికి చెందిన సిబ్బంది మాయంచేశారని ఆరోపించారు.

ఆసుపత్రికి చెందిన ఇద్దరు మహిళా సిబ్బంది బంగారు కమ్మలు మాయం చేసారాని ఆరోపిస్తూ ఆసుపత్రిలో ఆందోళన చేశారు. మా బంగారం ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. ఆసుపత్రి అధికారులు,సిబ్బంది, బాధితులతో పోలీసులు మాట్లాడి ఆందోళనను విరామింపజేశారు.

నేటి సాక్షి
కరీంనగర్
శుక్రవారం
24 ఏప్రిల్ 2026

# పరిగిలో భారత్ బంద్ అట్టహాసం





- కులగణనలో ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని డిమాండ్

**నేటి సాక్షి,పరిగి (సురేష్ మోత్కూర్):** కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని మరియు జనాభా లెక్కల పట్టికలో ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్‌ను పొందుపరచాలని డిమాండ్ చేస్తూ భారత్ ముక్తి మోర్చా, ఓబీసీ మోర్చా మరియు వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పరిగి పట్టణంలో భారత్ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మరియు బస్టాండ్ ఎదురుగా నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నిరసనను ఉద్దేశించి భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్ మాట్లాడుతూ.. 1931లో బ్రిటీష్ పాలనలో జరిగిన కులగణన తర్వాత సుమారు 90 ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు ఓబీసీల లెక్కలు తీయకపోవడం దారుణమని మండిపడ్డారు. దేశంలో జంతువుల లెక్కలు తీస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, పార్లమెంటులో తీర్మానం చేసినా ఓబీసీ కులగణన చేయకుండా బీసీలను మరోసారి మోసం చేస్తోందని విమర్శించారు. తక్షణమే బీసీ పట్టికను జనగణనలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. దీనితో పాటు, యూనివర్సిటీలలో ఎస్సీ, ఎస్టీ మరియు ఓబీసీ విద్యార్థులపై కులం పేరుతో జరుగుతున్న ర్యాగింగ్ మరియు అన్యాయాలను అరికట్టేందుకు యూజీసీ ఈక్విటీ చట్టం-2026ను కఠినంగా అమలు చేయాలని నాయకులు కోరారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని, ఇది బహుజనులను మోసం చేసే ప్రక్రియ అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, 2011 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ (ంజు) పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల న్యాయమైన హక్కులను నెరవేర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, ఎండి హబీబ్, సత్తయ్య, పీర్ మమ్మద్, భారత్ ముక్తి మోర్చా జిల్లా నాయకులు శంకర్, వీరేందర్ నాయక్, ఓబీసీ మోర్చా నాయకులు కృష్ణ, ఆర్టీసీ యూనియన్ కార్మికులు మరియు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కోరుట్ల గడి బురుజులు స్థలాలను కాపాడుకుందాం



- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సంఘీభావం
- రోజురోజుకు పెరుగుతున్న మద్దతు
- మూడో రోజుకు చేరిన అఖిలపక్ష నిరసన దీక్షలు

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):**కోరుట్ల పట్టణ చరిత్రకు ప్రతీకలైన గడి బురుజులు (గ్రామకంఠ. ఆబాది) స్థలాల పరిరక్షణ కోసం అఖిలపక్ష ప్రజాసంఘాలు చేపట్టిన నిరసన దీక్షలు రోజురోజుకు ఉధృతమవుతున్నాయి. మూడో రోజుకు చేరుకున్న ఈ ఉద్యమానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రత్యక్షంగా హాజరై పూర్తి మద్దతు ప్రకటించడంతో ఉద్యమానికి మరింత బలం చేకూరింది. గురువారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ గడిబురుజుల భూములపై విధించిన వివిల్టీలను వెంటనే పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా ప్రజల సామూహిక ఆస్తిగా ఉన్న ఈ భూములపై ఎలాంటి అక్రమాలు జరిగినా సహించబోమని, ఎవరు చేసినా ఊరుకోమని స్పష్టం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తమ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఈ అంశాన్ని అజెండాగా తీసుకువెళ్లి వివిల్టీల రద్దు కోసం కృషి చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ఇతర పార్టీల కౌన్సిలర్లు కూడా ప్రజల పక్షాన నిలబడి మద్దతు ఇస్తే కౌన్సిల్ సమావేశంలోనే వివిల్టీలను రద్దు చేయించే అవకాశం ఉందన్నారు. ప్రజల హక్కులను కాపాడే వరకు పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ నిరసన దీక్షకు కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, జమాత్-ఎ-ఇస్లామీ హింద్ కోరుట్ల పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్‌తో పాటు పలువురు పాత్రికేయులు, బీఆర్ఎస్ నాయకులు, చిరు వ్యాపారులు హాజరై తమ సంఘీభావాన్ని ప్రకటించారు. దీంతో ఉద్యమానికి అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గడి బురుజుల భూముల పరిరక్షణ కోసం ప్రారంభమైన ఈ ఉద్యమం రోజురోజుకు ప్రజా ఉద్యమంగా మారుతోంది. స్థానిక ప్రజలు, వ్యాపారులు, వివిధ రాజకీయ, సామాజిక, మత సంఘాల నాయకులు ఒక్కటై గడిబురుజుల స్థలాలను కాపాడుకోవాలని నినదిస్తుండటంతో కోరుట్లలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. కాగా, ఈ నిరసన దీక్షలో అఖిలపక్ష ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు చెన్న విశ్వనాథం, డాక్టర్ పేట భాస్కర్, ఎం.డి. ముజాహిద్, చింత భూమేశ్వర్, ఎం.డి. ముజీబుర్ రెహమాన్, తుమ్మనపల్లి శ్రీనివాస్ బాబు, సుతారి రాములు, కుంచెం శంకర్, షాహేద్ మహ్మద్ షేక్, పొతని శేఖర్, గొనె శంకర్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జాతర మహోత్సవం

- సంగెం గ్రామంలో ద్వారపాలకుల విగ్రహాల ప్రతిష్ఠాపనతో హోమాలు, యజ్ఞాలు, అన్నదానంతో భక్తి పారవశ్యం





**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మండలం సంగెం గ్రామంలో గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జాతర మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ శిఖరాన్ని నూతనంగా ఏర్పాటు చేయడంతో పాటు ద్వారపాలకుల విగ్రహాలను ప్రతిష్ఠించి, హోమాలు, యజ్ఞాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి జాతరను ఘనంగా విజయవంతం చేశారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ శిఖరాన్ని నూతనంగా ఏర్పాటు చేసి, ద్వారపాలకుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం వేదమంత్రోచ్చారణల నడుమ హోమాలు, యజ్ఞాలు నిర్వహించి స్వామివారికి ప్రత్యేక అర్చనలు చేశారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అన్నదానంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తి వాతావరణంలో జాతర ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మాజీ రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్, సర్పంచ్ చీటీ స్వరూప వెంకటరావు, ఉప సర్పంచ్ సుధావేణి మహేష్, బీఆర్ఎస్ అధ్యక్షులు సుధావేణి భూమయ్య, కోరుట్ల మార్కెట్ డైరెక్టర్ పోతుగంటి వెంకట్ గౌడ్, వార్డు సభ్యులు బోలు మల్ల నరేష్, ధోనె రాజు, బొల్లుమల్ల గంగాధర్, గంగారెడ్డి, గంగ నర్సయ్య, రాజా నర్సయ్య, దేవ లక్ష్మీనారాయణ, రవి, బొల్లుమల్ల ప్రవీణ్ తదితరులతో పాటు గ్రామ ప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల రవాణా, విక్రయంపై కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ (ఎండి ముబీన్)

జిల్లాలో నకిలీ,నిషేధిత విత్తనాల రవాణా, విక్రయంపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, డి. ఎస్. పి. మసీనొద్దీన్ లతో కలిసి మండలాల తహసిల్దార్లు , వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ, నిషేధిత విత్తనాల రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాబోయే వానాకాలం దృష్ట్యా విత్తన సరఫరా, నిల్వలు, నాణ్యత పై ప్రత్యేక దృష్టి సారించాలని, విత్తన దుకాణాలు, గోదాములను అక్రమంగా తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారు, సరైన అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. జిల్లా సరిహద్దులలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని, ఇతర ప్రాంతాల నుండి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల రవాణాపై నిఘా ఉంచాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి నకిలీ విత్తనాల గుర్తింపు, రసీదు స్వీకరణ ప్రాముఖ్యతపై రైతులకు వివరించాలని తెలిపారు. నకిలీ విత్తనాల నియంత్రణ కొరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, బృంద సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తనిఖీలు చేపట్టాలని తెలిపారు. ప్రతి మండలంలో తహసిల్దార్లు, వ్యవసాయ అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో నకిలీ విత్తనాలను పూర్తిస్థాయిలో నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంగించిన వారిపై కేసులు నమోదు చేసి అవసరమైతే లైసెన్సులు రద్దు చేయాలని తెలిపారు. అనంతరం ఇసుక అక్రమ రవాణా నియంత్రణపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాల ప్రకారం ఇసుక త్రవ్వకం, రవాణా పారదర్శకంగా సాగేందుకు ఆన్ లైన్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను ఫీజు చేయాలని, ఇసుక రవాణా పూర్తిగా ఆన్ లైన్ బుకింగ్ ద్వారా మాత్రమే జరగాలని తెలిపారు. ప్రజలు ఇసుక అక్రమ రవాణాను నిర్వహించడంలో భాగస్వాములు కావాలని, ఎక్కడైనా అక్రమ తరలింపు జరుగుతున్నట్లయితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బస్ డిపో వద్ద భద్రత ఏర్పాట్ల పరిశీలన

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె పిలుపునిచ్చిన నేపథ్యంలో నారాయణపేట పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా ఏర్పాట్లను మరియు అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్యతో సమావేశమై బస్సుల రాకపోకలు, డిపో వద్ద నెలకొన్న తాజా స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సమ్మె నేపథ్యంలో విధులకు హాజరయ్యే డ్రైవర్లు, ఇతర సిబ్బంది ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి పోలీసు శాఖ తరపున పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా రవాణా వ్యవస్థకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి ఆందోళనలకు దిగేవారిపై, విధులను అడ్డుకొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రెండు డిపోలలో ప్రస్తుతం పరిస్థితి శాంతియుతంగానే ఉందని, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రవాణా సౌకర్యాలు కొనసాగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు సీఐ నరేష్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ముమ్మరంగా భూ సర్వే



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు చిట్టెం పర్ణికా రెడ్డి మరియు మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మద్వార్ గ్రామంలో కోయిల్ సాగర్ కెనాల్ భూ సర్వే బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మాధవరం, మరికల్, అప్పంపల్లి గ్రామాల్లోని సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఈఈ, డీఈ, ఏఈలు ఈ సర్వేను నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి స్వయంగా దగ్గరుండి సర్వే పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మద్వార్, మరికల్, అప్పంపల్లి గ్రామ ప్రజల చిరకాల స్వప్నమైన ఈ కాల్వ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు సాగునీటి కష్టాలు తీర్చడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మరికల్ సర్పంచ్ చెన్నయ్య, మాధవరం సర్పంచ్ మొగులన్న, ఉపసర్పంచ్ భీమన్న, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారిక ప్రకటన హర్షనీయం

**ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నీల వెంకటేశ్వర్లు గుప్త**



**నేటి సాక్షి,నల్లబెల్లి:** ఆర్యవైశ్య సామాజిక వర్గ కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించటం పట్ల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీల వెంకటేశ్వర్లు గుప్త హర్షం వ్యక్తం చేశారు. గురువారం నల్లబెల్లిలో ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్యవైశ్యులు వాసవి మాత జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతున్నారని, ఈ క్రమంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ ప్రకటన ఆర్యవైశ్య సామాజిక వర్గానికి ఎంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. వాసవి మాత జయంతిని అధికారిక ఉత్సవంగా గుర్తించేందుకు కృషి చేసిన ఆర్యవైశ్య మహాసభ అధినాయకులకు, రాష్ట్ర మంత్రివర్గానికి నల్లబెల్లి మండల ఆర్యవైశ్య సంఘం పక్షాన ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఆర్యవైశ్యుల పట్ల ప్రభుత్వ గౌరవానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.



# మైదానంలో పరుగుల వర్షం..
# బయట డాన్స్ సెన్సేషన్
## ఫిదా చేస్తున్న సన్‌రైజర్స్!
### వైరల్ అవుతున్న ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ డాన్స్ వీడియో

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్ హెచ్) జట్టు ఫుల్ జోష్‌లో ఉంది. కేవలం బ్యాట్, బాల్‌తోనే కాకుండా తమదైన శైలిలో వినోదాన్ని పంచుతూ అభిమానుల మనసు గెలుచుకుంటోంది. తాజాగా జట్టు కెప్టెన్ ఇషాన్ కిషన్, ఓపెనర్ అభిషేక్ శర్మ కలిసి విదేశీ ఆటగాడు ట్రావిస్ హెడ్‌కు డాన్స్ నేర్పిస్తున్న వీడియో సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. కెమెరా వెనుక నుంచి ఇషాన్, అభిషేక్ స్టెప్పులు వేస్తుంటే, వాటిని అనుకరిస్తూ ట్రావిస్ హెడ్ చేసిన సందడి నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుత సీజన్‌లో ఆరెంజ్ ఆర్మీ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి వరుసగా మూడో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి (7 మ్యాచ్‌లు, 4 విజయాలు, 8 పాయింట్లు) దూసుకెళ్లింది. జట్టు నెట్ రన్ రేట్ (ం0.820) కూడా ఇతర జట్లతో పోలిస్తే మెరుగ్గా ఉండటం ప్లేఆఫ్స్ అవకాశాలను మెరుగుపరుస్తోంది. ఈ సీజన్‌లో ఎస్ఆర్హెచ్ బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నారు. ముఖ్యంగా యువ సంచలనం అభిషేక్ శర్మ 323 పరుగులతో ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఢిల్లీపై అతను చేసిన అజేయ సెంచరీ (135ి) సీజన్‌కే హైలైట్‌గా నిలిచింది. మరోవైపు స్టార్ ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్ కూడా 320 పరుగులతో రెండో స్థానంలో ఉండి గట్టి పోటీనిస్తున్నాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్ కూడా బ్యాటింగ్‌లో రాణిస్తూ జట్టును ముందుండి నడిపిస్తున్నారు. ఆటగాళ్ల మధ్య ఉన్న ఈ స్నేహపూర్వక వాతావరణమే మైదానంలో జట్టు విజయాలకు కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు.




# కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన
### రాజస్థాన్ రాయల్స్ ప్లేయర్ కు జరిమానా, డీమెరిట్ పాయింట్ కూడా.!

రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఆర్ఆర్ 40 పరుగుల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్ పై ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో లక్నో జట్టు 18 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది. ఇది ఇలా ఉండగా రాజస్థాన్ రాయల్స్ జట్టు పేసర్ నంద్రే బర్గర్ కు పెద్ద షాక్ తగిలింది. మ్యాచ్‌లో కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించినందుకు అతనిపై మ్యాచ్ ఫీజులో 10% జరిమానా విధించారు. అంతేకాకుండా ఒక డీమెరిట్ పాయింట్ కూడా నమోదు చేశారు. ఐపీఎల్ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. బర్గర్ మ్యాచ్ సమయంలో అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డాడు. ముఖ్యంగా ఇతర ఆటగాళ్లను రెచ్చగొట్టేలా లేదా అవమానించేలా మాటలు, చర్యలు, హావభావాలు ప్రదర్శించినందుకు అతను ఆర్టికల్ 2.5ను ఉల్లంఘించినట్లు గుర్తించారు. ఈ ఉల్లంఘన లెవల్-1 కేటగిరీలోకి వస్తుంది. ఈ రకమైన కేసుల్లో మ్యాచ్ రిఫరీ తీసుకునే నిర్ణయం తుదిగా ఉంటుంది. దీనితో బర్గర్ పై విధించిన శిక్ష అమల్లోకి వచ్చింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే రాజస్థాన్ రాయల్స్ బౌలింగ్ విభాగం అద్భుతంగా రాణించి లక్నో సూపర్ జెయింట్స్‌ను 40 పరుగుల తేడాతో ఓడించింది. బౌలర్ల సమిష్టి ప్రదర్శనతో రాజస్థాన్ జట్టు విజయం సాధించింది.



# సీఎస్‌కే విశ్వరూపం!

- ముంబై ఇండియన్స్‌పై 103 పరుగుల భారీ తేడాతో ఘన విజయం
- సెంచరీతో చెలరేగిన సంజూ శాంసన్
- అకీల్ హుస్సేన్ స్పిన్ మాయాజాలానికి ముంబై విలవిల




**ముంబై, ఏప్రిల్ 24:** ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సంచలన విజయం సాధించింది. సొంత గడ్డపై ముంబై ఇండియన్స్ (ఎంఐ)కు ఘోర పరాభవం ఎదురైంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన సీఎస్‌కే.. ఏకంగా 103 పరుగుల భారీ తేడాతో ముంబైని చిత్తు చేసి టోర్నీలో తమ సత్తా చాటింది.

### సంజూ శాంసన్ సెంచరీ మోత

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన సీఎస్‌కే నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోరు సాధించింది. స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 54 బంతుల్లోనే అజేయంగా 101 పరుగులు చేసి ముంబై బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతడితో పాటు రుతురాజ్ గైక్వాడ్ (22), డెవాల్డ్ బ్రెవిస్ (21) పరుగులతో రాణించారు. ముంబై బౌలర్లలో అల్లాహ్ గజన్‌ఫర్ 2, అశ్వనీ కుమార్ 2, జస్‌ప్రీత్ బుమ్రా ఒక వికెట్ తీశారు.


### కుప్పకూలిన ముంబై బ్యాటింగ్

208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ఏ దశలోనూ విజయావకాశాలు కనిపించలేదు. సీఎస్‌కే బౌలర్ల ధాటికి ముంబై బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. తిలక్ వర్మ (37), సూర్యకుమార్ యాదవ్ (36) మినహా ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. స్టార్ బ్యాటర్ క్వింటన్ డికాక్ కేవలం 7 పరుగులకే వెనుదిరిగాడు. దీంతో ముంబై 19 ఓవర్లలో కేవలం 104 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

### అకీల్ హుస్సేన్ మాయాజాలం సీఎస్‌కే

స్పిన్నర్ అకీల్ హుస్సేన్ తన స్పిన్ మాయాజాలంతో ముంబై నడ్డి విరిచాడు. తన 4 ఓవర్ల స్పెల్‌లో కేవలం 17 పరుగులు ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి ముంబై పతనాన్ని శాసించాడు. అతడికి తోడుగా నూర్ అహ్మద్ 2, గుర్జప్‌నీత్ సింగ్ ఒక వికెట్ తీశారు. బ్యాటింగ్‌లో సంజూ శాంసన్, బౌలింగ్‌లో అకీల్ హుస్సేన్ అద్భుత ప్రదర్శనతో సీఎస్‌కేకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.












# నేహా శర్మ 'బ్లాక్' మ్యాజిక్

## 'చిరుత' బ్యూటీ గ్లామర్ విందు!


## వైరల్ అవుతున్న లేటెస్ట్ ఫొటోషూట్..

తెలుగు తెరపై మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పక్కన 'చిరుత'గా గర్జించిన అందాల భామ నేహా శర్మ, మరోసారి ఇంటర్నెట్ లో సెగలు పుట్టిస్తోంది. సినిమాల రిజల్ట్ తో సంబంధం లేకుండా తన గ్లామర్ తో నిరంతరం వార్తల్లో ఉండే ఈ బ్యూటీ, తాజాగా సోషల్ మీడియా వేదికగా వదిలిన ఫోటోలు నెటిజన్ల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. బ్లాక్ డ్రెస్‌లో ఆమె పండించిన సోయగం ఇప్పుడు ట్రెండింగ్‌గా మారింది. టాలీవుడ్‌లోకి భారీ ఎంట్రీ ఇచ్చిన నేహా శర్మ, తన మొదటి సినిమాతోనే యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఆ తర్వాత వరుణ్ సందేశ్‌తో కలిసి 'కుర్రాడు' సినిమాలో నటించినప్పటికీ, ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో టాలీవుడ్‌కు కొంత దూరమైంది. అయితే, పట్టువదలని విక్రమార్కుడిలా బాలీవుడ్ వైపు అడుగులు వేసి, అక్కడ వరుస అవకాశాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. హిందీ వెండితెరపై మోస్తరు విజయాలను అందుకుంటూ కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తోంది. సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియాలో తన అభిమానులను అలరించడంలో నేహా ఎప్పుడూ ముందుంటుంది. తాజాగా ఆమె నలుపు రంగు దుస్తుల్లో ఒక అద్భుతమైన ఫోటోషూట్ నిర్వహించింది. ఒక కుర్చీలో స్టైలిష్‌గా కూర్చుని, వేర్వేరు యాంగిల్స్‌లో తన అందచందాలను ఆరబోస్తూ నెటిజన్లను ఫిదా చేసింది. ఆ ఫోటోల్లో నేహా చూపిస్తున్న హావభావాలు, ఆమె స్టైలిష్ లుక్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ లుక్‌లో నేహా అందం చూస్తుంటే, 'మళ్లీ ఈ చిరుత బ్యూటీ టాలీవుడ్‌లోకి రీ-ఎంట్రీ ఇస్తే బాగుండు' అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. తన గ్లామర్ తో మరోసారి ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిన నేహా శర్మ, మున్ముందు మరెన్ని క్రేజీ ప్రాజెక్టులతో అలరిస్తుందో చూడాలి.




# విడిగా ఉన్నా... సంతోషంగానే: రకుల్

టాలీవుడ్, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్, నటుడు-నిర్మాత జాకీ భగ్నానీ తమ వైవాహిక జీవితంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. 2024 ఫిబ్రవరి 21న గోవాలో ఘనంగా పెళ్లి చేసుకున్న ఈ జంట, పెళ్లి తర్వాత కూడా తమ బంధాన్ని స్వేచ్ఛ, పరస్పర గౌరవంతో కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో రకుల్ మాట్లాడుతూ, "మేమిద్దరం విడిగా ఉన్నా కూడా సంతోషంగానే ఉంటాం. ఒకరి జీవితాన్ని మరొకరు పూర్తిచేయడానికి పెళ్లి చేసుకోలేదు. మేమిద్దరం వ్యక్తిగతంగా కూడా స్ట్రాంగ్‌గానే ఉన్నాం" అని చెప్పింది. కలిసి ఉన్నప్పుడు ఆ ఆనందం మరింత రెట్టింపు అవుతుందని ఆమె పేర్కొంది. జాకీ భగ్నానీ కూడా తమ బంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మేము భార్యాభర్తలమే అయినా, మా మధ్య ఉన్న స్నేహం, పారదర్శకతే అసలు బలం. ఏ విషయమూ దాచుకోకుండా మాట్లాడుకుంటాం" అని తెలిపారు. పరస్పర నమ్మకం, స్పష్టతతో తమ దాంపత్యాన్ని ప్రత్యేకంగా మలుచుకుంటున్న ఈ జంట, ఆధునిక సంబంధాలకు కొత్త దారి చూపుతోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.




# త్రిష పోస్ట్‌తో మళ్లీ చర్చల్లో విజయ్

దక్షిణాది సినీ పరిశ్రమలో ఎప్పుడూ వార్తల్లో ఉండే త్రిష, దళపతి విజయ్‌ల అనుబంధం మరోసారి సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. గతంలో వీరిద్దరూ కలిసి కనిపించిన సందర్భాలు, వాటికి సంబంధించిన ఫోటోలు వైరల్ కావడంతో అనేక రకాల ప్రచారాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయాలపై ఇద్దరూ ఎప్పుడూ స్పందించలేదు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో త్రిష తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం తన వేలిపై సిరా గుర్తును చూపిస్తూ ఒక ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సాధారణంగా సెలబ్రిటీలు ఓటింగ్‌పై అవగాహన కల్పించే పోస్టులు పెడతారు. కానీ త్రిష తన పోస్ట్‌కు జత చేసిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇప్పుడు ప్రత్యేక చర్చకు కారణమైంది. విజయ్‌తో కలిసి నటించిన 'గిల్లి' సినిమాలోని ప్రసిద్ధ గీతాన్ని ఆమె ఆ పోస్ట్‌కు ఉపయోగించడం అభిమానుల్లో ఆసక్తి రేపింది. ముఖ్యంగా ఆ పాట ఎంపిక వెనుక ఉన్న అర్థాలపై నెటిజన్లు విశ్లేషణలు చేస్తున్నారు. కొందరు దీన్ని విజయ్‌కు పరోక్ష మద్దతుగా భావిస్తుండగా, మరికొందరు ఇది కేవలం యాదృచ్ఛికమేనని అంటున్నారు. ఇప్పటికే వీరిద్దరి మధ్య అనుబంధంపై వస్తున్న వార్తలకు ఈ పోస్టు మరింత ఊతమిచ్చింది. విజయ్ రాజకీయాల్లో కీలకంగా అడుగులు వేస్తున్న సమయంలో త్రిష చేసిన ఈ చర్య సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆమె నేరుగా ఎలాంటి ప్రకటన



# స్టైల్ రూల్స్ మార్చేసిన మాళవిక

హీరోయిన్ మాళవిక మోహనన్ మరోసారి తన స్టైలిష్ లుక్స్‌తో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. భిన్నమైన అవుట్‌ఫిట్స్‌లో కనిపిస్తూ తన ఫ్యాషన్ వెర్సటిలిటీని చాటుకుంది. చాక్లెట్ బ్రౌన్ ఆఫ్‌షోల్డర్ రిబ్డ్ మిడీ డ్రెస్‌లో ఆమె క్లాసీగా మెరిసింది. భారీ గోల్డ్ ఇయర్‌రింగ్స్, స్లీక్ పోనీటైల్‌తో కలిసి ఆ లుక్‌కు రిచ్ ఫినిష్ ఇచ్చింది. మిర్రర్ సెల్ఫీలో కనిపించిన ఆమె ఫిట్ సిల్హౌట్ సోషల్ మీడియాలో వెంటనే ట్రెండ్ అయింది. ఇక మరో లుక్‌లో పూర్తిగా భిన్నమైన స్టైల్‌తో కనిపించింది. డెనిమ్ బ్లేజర్‌ను బ్లాక్ బ్రాలెట్‌తో జత చేసి, ట్రాపికల్ ప్రింట్ స్లిట్ స్కర్ట్, గోల్డ్ ప్లాట్‌ఫామ్ హీల్స్‌తో బోల్డ్ ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఈ కాంబినేషన్ ఆమెకు మరింత గ్లామర్ జోడించింది. ఇటీవల వచ్చిన 'రాజా సాబ్' సినిమా ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, మాళవిక మాత్రం తన జోరు తగ్గించడం లేదు. ప్రస్తుతం 'సర్దార్ 2', 'పాకెట్ నవెల్' వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, ఫ్యాషన్ పరంగా కూడా ట్రెండ్ సెట్ చేస్తూనే ఉంది.



# కోర్సెట్ లుక్‌లో అదిరిపోయిన రాశి సింగ్

హీరోయిన్ రాశి సింగ్ తాజా ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. బ్లష్ పింక్ స్ట్రాప్‌లెస్ కోర్సెట్ డ్రెస్‌లో ఆమె సాఫ్ట్ గ్లామ్ లుక్‌తో ఆకట్టుకుంది. క్లీన్ మిడీ సిల్హౌట్, స్ట్రక్చర్డ్ కోర్సెట్ డిజైన్ కలిసి ఈ లుక్‌ను మరింత స్టైలిష్‌గా మార్చాయి. ఈ ఫోటోల్లో ఆమె ప్రతి ఫ్రేమ్‌ను తన స్టైల్‌తో పూర్తిగా ఆక్రమించింది. ఒక ఫోటోలో డ్రీమీ, ఎలిగెంట్ లుక్‌లో కనిపిస్తే, మరో షాట్‌లో పూర్తి కాన్ఫిడెన్స్‌తో బోల్డ్ పోజ్ ఇచ్చింది. వేవీ హెయిర్, ఎక్స్‌ప్రెషన్స్‌తో రెండు విభిన్న వైబ్స్ చూపించినా, ప్రతి లుక్‌లోనూ ఆకర్షణ తగ్గలేదు. యాక్సెసరీస్ కూడా ఈ లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లేయర్డ్ గోల్డ్ నెక్లేస్‌లు, చంకీ హూప్ ఇయర్‌రింగ్స్, గోల్డ్ బ్రేస్‌లెట్, న్యూడ్ షేడ్స్‌తో ఆమె స్టైలింగ్‌ను పూర్తిచేసింది. సింపుల్ పింక్ షేడ్‌కే కొత్త కాన్ఫిడెన్స్ ఇచ్చిన రాశి సింగ్, మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అభిమానులను ఆకట్టుకుంది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# బాల్య వివాహాలతో అనర్థాలు




**నేటి సాక్షి, చౌడేపల్లి :** బాల్య వివాహాల వల్ల అనర్థాలు అధికంగా ఉంటాయని పిఓఐసి రాములమ్మ అన్నారు .గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని అంగన్వాడీలు ఆశా కార్యకర్తలకు బాల్యవివాహాలు చిన్నతనంలో గర్భం దాల్చడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నతనంలోనే గర్భం దాల్చడం వల్ల అనేక సమస్యలు ఉన్నాయన్నారు. సరైన వయసు వచ్చేసరికి మహిళలు వృద్ధాప్యాన్ని భరించి పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు చట్టంపై అవగాహన కల్పించారు సమాజంలో మహిళల పాత్ర పై వివరించారు .ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సులోచన రాధమ్మలు మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు

# జ్ఞానానికి జంట చేయూత

## పెళ్లిరోజున గ్రంథాలయానికి పుస్తకాల దానం




**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల కేంద్రానికి చెందిన తోడేటి సరిత–చందు దంపతులు జ్ఞానానికి చేయూతగా నిలుస్తూ తమ 25వ వివాహ వార్షికోత్సవాన్ని గురువారం సేవా కార్యక్రమంతో ప్రత్యేకంగా జరుపుకున్నారు. తమ పెళ్లిరోజును పురస్కరించుకుని గ్రామంలో వివేకానంద యూత్ సభ్యులు నిర్వహిస్తున్న గ్రంథాలయానికి వివిధ రకాల 1300 పుస్తకాలను అందజేసి ఆదర్శంగా నిలిచారు. విద్యాభివృద్ధికి పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని భావించి ఈ సహాయం చేసినట్లు దంపతులు తెలిపారు. గ్రామ యువత చదువులో ముందుకు సాగాలని, గ్రంథాలయం ద్వారా జ్ఞానం పెంపొందించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివేకానంద యూత్ సభ్యులు దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి సేవా భావాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరింత మంది కోసం ఆదర్శంగా నిలుస్తాయని పలువురు పేర్కొన్నారు.

# వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి

## రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షణీయం, రాజమౌళి గుప్తా



**నేటి సాక్షి గజ్వేల్:** తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం అహింసా మూర్తి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తా అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వైశాఖ లిశుక్లపక్ష దశమిలి నాడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వమే అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ప్రకటించడం పట్ల ఆర్యవైశ్య సంఘం తరఫున స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల ఏప్రిల్ 26న వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలను గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే ఆర్యవైశ్య సమాజంలో ఉన్న నిరుపేదలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని, నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్పొరేషన్ ద్వారా నిరుపేదలకు తక్కువ వడ్డీ రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులపై దాడులు చేస్తే కఠిన చర్యలు



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డ్రైవర్ల రక్షణకు కట్టుబడి ఉన్నామని, విధులకు ఆటంకం కలిగించినా లేదా బస్సులను ధ్వంసం చేసినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థ ఉమ్మడి ఆస్తి అని, బస్సులపై రాళ్లు రువ్వడం లేదా అరాచక చర్యలకు పాల్పడే వారిని వీడియో సాక్ష్యాధారాల ఆధారంగా గుర్తించి కఠినంగా శిక్షిస్తామని, అటువంటి వారు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులవుతారని ఆమె హెచ్చరించారు. సోషల్ మీడియాలో హింసను ప్రేరేపించే వారిపై నిఘా ఉంచామని, యువత భావోద్వేగాలకు లోనై జీవితాలను పాడుచేసుకోవద్దని, ఏదైనా నిరసన ఉంటే శాంతియుత మార్గంలో తెలపాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారం ఉంటే వెంటనే 'డయల్ 100'కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# ఈనెల 25 లోపు మండల కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక



**నేటి సాక్షి ,మక్తల్,నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'సంఘటన సుజన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతంపై కీలక చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మక్తల్ నియోజకవర్గ కోఆర్డినేటర్, తెలంగాణ రాష్ట్ర పాల డైరీ కార్పొరేషన్ చైర్మన్ అమిత్ రెడ్డి, మరియు నారాయణపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘుపతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 25వ తేదీలోపు జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షుల పేర్లను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో బూత్ కమిటీ సభ్యులను సమన్వయం చేస్తూ, పార్టీని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. బూత్ లెవెల్ ఏజెంట్ బాధ్యతల నుండి జిల్లా అధ్యక్షుడి వరకు అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. మండల అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న ఆశావాహులు మరియు నాయకులతో అభిప్రాయ సేకరణ జరిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో మరింత బలంగా నిలబడేందుకు కార్యకర్తలే కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, పదవి ఆశించే అభ్యర్థులు, జిల్లా పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- ఐదుగురికి కారుణ్య నియామక పత్రాలు అందజేసిన ఎస్పీ నితికా పంత్



**నేటి సాక్షి,కొమురం భీం ఆసిఫాబాద్(ఎండి ముబీన్):** జిల్లా పోలీస్ శాఖలో విధి నిర్వహణలో ఉండగా మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన ఐదుగురు అభ్యర్థులకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాలను ఎస్పీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పోలీస్ కుటుంబాలను ఆదుకోవడమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. కొత్తగా విధుల్లో చేరుతున్న వారు క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, తమ కుటుంబాలకు గౌరవం తీసుకురావాలని సూచించారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో జాదవ్ రాజ్ కుమార్, కే వినోద్ కుమార్, రాథోడ్ మమత, ముదాసిర్ అహ్మద్ మరియు నాగార్జున ఉన్నారు. ఈ క్లిష్ట సమయంలో తమకు ఉపాధి కల్పించినందుకు అభ్యర్థులు మరియు వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వం మరియు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సూపరింటెండెంట్ ఖలిముద్దీన్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు మున్నం విజయ శంకర్ రెడ్డి మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులను వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలి

## టీయూసీఐ డిమాండ్

**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** ఆర్టీసీ కార్మికులను తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేసి, వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని టీయూసీఐ (TUCI) జిల్లా నాయకత్వం డిమాండ్ చేసింది. నారాయణపేట బస్ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలుపుతూ టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిన్‌పల్లి రాము, ఉపాధ్యక్షులు బి. నర్సింహా, జిల్లా నాయకులు కెంచి నారాయణ బుధవారం నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, నేడు అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. అలాగే కార్మికులకు 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు టీయూసీఐ నిత్యం పోరాటంలో అండగా ఉంటుందని, తమ హక్కుల సాధన కోసం సమ్మెను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



ఆర్టీసీ కార్మికులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతుకు అండగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం



- ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం
- జూబ్లీ నగర్,ఫకీర్ పేట్ వద్ద కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**నేటిసాక్షి, కరీంనగర్ :** రైతులకు ఎల్లప్పుడూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పండించిన ధాన్యం అమ్ముకోవడానికి గతంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్,ఫకీర్ పేట్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభి రైతులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అనేక ఇబ్బందులు పెట్టారని తప్ప,తాలు పేరు మీద అనేక ఇబ్బందులు పెట్టారని నరేందర్ రెడ్డి అన్నారు. రైతును రాజును చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గత ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల అప్పుల ఖజానా అప్పజెప్పినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుకు అండగా నిలవడం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని నరేందర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమాలలో ఎపిఎం రామ్మోహన్, సిసి లు కృష్ణ,అశోక్,పిఏసిఎస్ సిఇఓ రమేష్,సర్పంచులు సుద్దాల కమలాకర్, బొద్దుల విజయ లక్ష్మి లక్ష్మణ్,వివో సునీత తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే జోష్



- ప్రైవేట్‌కు పోటీగా ప్రభుత్వ పాఠశాల కార్యక్రమం

**నేటి సాక్షి,ఎండపల్లి:** మండలం పరిధి కొండాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని, ఎదుగుదలను చాటుతూ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం ప్రధానోపాధ్యాయులు చుక్క మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇటీవలి కాలంలో పాఠశాలల్లో గ్రాడ్యుయేషన్ వేడుకలు ఉత్సాహంగా సాగుతుండగా, కొండాపూర్ పాఠశాలలో కూడా అదే జోష్ కనిపించింది. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ గౌన్లు, టోపీలు ధరింపజేసి సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. చిన్నారుల ఆనందం, తల్లిదండ్రుల గర్వభావం వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి హాజరైన వారిని ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చిన్నారుల ప్రతిభను ప్రశంసించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన విద్యాధికారి సముద్రాల హరికృష్ణ, ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శైలేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుండటం సంతోషకరమని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో ముందుకు సాగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు తాటిపర్తి రాజిరెడ్డి, ఉప సర్పంచ్ విజయ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అరుణ, నాయకులు మన్నె జితేందర్, చెన్న కుమారస్వామి, ఉపాధ్యాయులు ప్రణీత, లావణ్య, కిషోర్, రవీందర్, సత్తయ్య, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI


# కౌసల్యదేవిపల్లిలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



**నేటి సాక్షి,మహబూబాబాద్:** నరసింహులపేట మండలం కౌసల్యదేవిపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠ మరియు గ్రామ దేవత ముత్యాలమ్మ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తి పరవశంలో మునిగితేలారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి డి.ఎస్. రెడ్యా నాయక్, మాజీ మంత్రి సత్యావతి రాథోడ్, బండ బిక్షం రెడ్డి, సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస రెడ్డి, అయూబ్ పాషా తదితరులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి మరియు ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని వారు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గొట్టిముక్కుల ఉపేంద్ర నరసింహారెడ్డి, రాయపాటి చంద్రారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సరితా శ్రీనివాస్ రెడ్డి, ఎడ్ల విష్ణువర్ధన్ రెడ్డి, రామతార సత్తయ్య, బానోతు రవి, బానోతు సురేష్ మరియు గ్రామ ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, సంప్రదాయాలు మరియు సంస్కృతి ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ ఉత్సవాలు భక్తుల మన్ననలు పొందాయి.

# గురుకుల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



- తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలను సందర్శించిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్,జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**నేటి సాక్షి, జగిత్యాల (పూరెళ్ల బాపు):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు మరియు ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఉదయం అల్పాహారాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచిపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. డైట్ మెను, వంటగది పరిశుభ్రత, నీటి వినియోగం, నిల్వ విధానాలు, కిచెన్ షెడ్ నిర్వహణపై ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వెల్ఫేర్ వీక్ నిర్వహణ ద్వారా ప్రజా ప్రభుత్వం సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నదని తెలిపారు. సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా పోషకాహారం సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రతి విద్యార్థికి సమయానికి అల్పాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ

ప్రభుత్వం సంక్షేమ విద్యాసంస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తు బలపడుతుందని పేర్కొన్నారు. కళాశాలల్లో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులకు ఉత్తమ వసతులు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ

విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వారికి అందించే అల్పాహారం నాణ్యంగా, పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని తెలిపారు. వంటశాలల్లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన పదార్థాలతో ఆహారం సిద్ధం చేయాలని సూచించారు. సంక్షేమ పాఠశాలల్లో మెనూ సమర్థవంతంగా అమలు కావాలని, విద్యార్థులకు సురక్షితమైన మరియు శుభ్రమైన వాతావరణంలో అల్పాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా సంక్షేమ అధికారి కె. రాజ్ కుమార్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ దినేష్, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, తహసీల్దార్, ఎంపిడివో, మండల విద్యాధికారి, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు సిఐలకు స్థానచలనం



కోరుట్ల సి.ఐ. గా కే. లక్ష్మీనారాయణ



మల్టీ జోన్-1 కు అటాచ్ చేయబడ్డ సి.ఐ. అనిల్



మెట్ పల్లి సి.ఐ. గా సురేష్ బాబు

- కోరుట్ల సీఐగా కే. లక్ష్మీనారాయణ నియామకం
- ప్రస్తుత సీఐ డి. సురేష్ బాబు మెట్‌పల్లికి బదిలీ
- మెట్‌పల్లి సిఐ వి. అనిల్ కుమార్ మల్టీ జోన్-1 ఐజీపీ కార్యాలయానికి రిపోర్ట్

**నేటి సాక్షి,కోరుట్ల (రాధారపు నర్సయ్య):** తెలంగాణ రాష్ట్ర మల్టీ జోన్-1 పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు ఉత్తర్వుల మేరకు జగిత్యాల జిల్లాలో కీలక పోలీసు అధికారుల బదిలీలు చోటుచేసుకున్నాయి. కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న డి. సురేష్ బాబు మెట్‌పల్లి సర్కిల్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని జమ్మికుంట రూరల్ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న కే. లక్ష్మీనారాయణను కోరుట్ల సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

### మల్టీ జోన్-1 ఐజీపీ ఉత్తర్వులు

హైదరాబాద్‌లోని మల్టీ జోన్-1 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఐపీఎస్ ఆధ్వర్యంలోని పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు పరిపాలనా కారణాలతో ఈ బదిలీలు చేపట్టింది. ఇందుకు సంబంధించిన ఎం.జెడ్.ఓ నం. 12.9/2026 ఉత్తర్వులు గురువారం విడుదలయ్యాయి.

### కోరుట్ల సీఐ డి. సురేష్ బాబు బదిలీ

ప్రస్తుతం జగిత్యాల జిల్లా కోరుట్ల సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ డి. సురేష్ బాబును ఇదే జిల్లాలోని మెటపల్లి సర్కిల్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న వి. అనిల్ కుమార్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక మెట్‌పల్లి సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ వి. అనిల్ కుమార్‌ను హైదరాబాద్‌లోని మల్టీ జోన్-1 ఐజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

### కోరుట్లకు కే. లక్ష్మీనారాయణ

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని జమ్మికుంట రూరల్ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ కే. లక్ష్మీనారాయణను కోరుట్ల సర్కిల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డి. సురేష్ బాబు స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. సంబంధిత యూనిట్ అధికారులు పై అధికారులను వెంటనే రిలీవ్ చేసి, వారు ఎప్పుడు విధుల నుంచి రిలీవ్ అయ్యారో వివరాలను మల్టీ జోన్-1 ఐజీపీ కార్యాలయానికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బదిలీలతో జగిత్యాల జిల్లా పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# గత ప్రభుత్వ బాటలోనే కాంగ్రెస్

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ డిమాండ్



**నేటి సాక్షి,నల్లబెల్లి :** తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల సమస్యలు పరిష్కారిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చి సగం కాలం గడుస్తున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దారుణమని నల్లబెల్లి మండల సీపీఐ నాయకులు కడియాల క్రాంతి కుమార్, పరికి కోర్నేలు, మామిండ్ల పెద్ద అయిలయ్యలు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం ప్రభుత్వ వైఫల్యమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీ సమస్యలను పట్టించుకోనప్పుడు 52 రోజుల సమ్మెకు మద్దతు తెలిపిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలో ఉండి కూడా కార్మికులకు వ్యతిరేకంగా ఒంటెద్దు పోకడలు అనుసరిస్తోందని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శంకర్ గౌడ్‌కు ప్రభుత్వమే నాణ్యమైన చికిత్స అందించాలని, అతనికి ఏం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన పోరాటాలకు సీపీఐ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేస్తూ, కార్మికులు ఎవరూ ఆత్మహత్యలకు పూనుకోవద్దని, ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరికల్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పి. మల్లేష్



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రమైన మరికల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పి. మల్లేష్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ కార్యదర్శిగా విధులు నిర్వహించిన శ్యాంసుందర్ రెడ్డి పదోన్నతి (ప్రమోషన్) పొంది బదిలీ కావడంతో ఆ స్థానంలో మల్లేష్‌ను జిల్లా అధికారులు నియమించారు. ఇప్పటివరకు మరికల్ మండలంలోని తీలేరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సేవలందించిన మల్లేష్‌ను, మరికల్ గ్రామ పంచాయతీ బాధ్యతలను చేపట్టాల్సిందిగా నారాయణపేట జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించగా, పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. మరికల్ గ్రామ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. గ్రామ సమస్యల పరిష్కారంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

# యూత్ కాంగ్రెస్ నాయకుడు అజర్ కు సన్మానం



**నేటి సాక్షి, శంకర్ పల్లి;** ఇటీవల శంకర్ పల్లి మండలం మోకిలా గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులుగా ఎన్నికైన ఎండి అజర్ ను మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ సంతోష్ గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బడే సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపే దానికి యువ నాయకులు బాగా శ్రమించాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎంపికైన ఎండి. అజర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మాధవి సురేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, ఎండి. నయీమ్, ఖాదర్ పా షా, వార్డు సభ్యులు శ్రీను, చేవెళ్ల రాజు, లతా లక్ష్మణ్, కిరణ్, చాకలి ఉమారాణి ప్రసాద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# 35 చిత్ర పటాలు ఆవిష్కరణ



**నేటి సాక్షి,చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం పాలెఅన్నారం జిల్లా పరిషత్ పాఠశాలలో జాతయ నాయకులు, శాస్త్రవేత్తల, క్రీడాకారుల చిత్ర పటాలను ఆవిష్కరణను ప్రారంభిస్తున్న తహసీల్దార్, సర్పంచ్ చిలుకూరు: మండలంలోని పాలెఅన్నారం జిల్లా పరిషత్ పాఠశాలలో దాతల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన 65 జాతీయ నాయకులు, శాస్త్రవేత్తలు, క్రీడాకారుల చిత్ర పటాలను గురువారం తహసీల్దార్ ధృవకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఆదర్శనీయం అయిన జాతీయనాయకులు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు తదితర నాయకుల చిత్ర పటాలను ఏర్పాటు చేయడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గుజ్జుల నరసింహారెడ్డి, సర్పంచ్ మండవ జయమ్మ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ గంద్ర లింగస్వామి, ఆర్‌ఎ మంత్రిప్రగడ సీతారామచంద్రరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి



**నేటిసాక్షి నల్లబెల్లి:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రతిఒక్కరు ఉపయోగించుకోవాలని శనగరం గ్రామ సర్పంచ్ ఊట్కూరి అశోక్ గౌడ్ కోరారు. గురువారం గ్రామ సమీపంలో గల దొప్పని చెరువులో ఉపాధి హామీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వలసలను తగ్గించడానికి పార్లమెంటులో ఉపాధి హామీ పథకానికిని చట్టబద్ధత కల్పించి పనికి తగ్గ వేతనం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఆయన గుర్తు చేశారు. జాబ్ కార్డు ఉన్న ప్రతికూలి పని కోసం వలస వెళ్లకుండా ఉన్నచోటనే పని కల్పించేదే ఉపాధి హామీ పథకమని ఆయన తెలిపారు. పనికి తగ్గ వేతనం రోజుకు రూ. 307/- సంపాదించుకునే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ యు రమేష్ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరు నూతన సమాచార హక్కు రక్షణ చట్టం



**నేటి సాక్షి చిలుకూరు ,సూర్యాపేట:** చిలుకూరు మండల కేంద్రంలో గురువారం సమాచార హక్కు రక్షణ చట్టం 2005 చిలుకూరు మండల నూతన కమిటీని కోదాడ నియోజకవర్గం ఇంచార్జ్ గడ్డం అంజి, కోదాడ మండల గౌరవ సలహాదారు అమరబోయిన వీరబాబు,బత్తుల శీను ఆధ్వర్యంలో చిలుకూరు మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. చిలుకూరు మండల ఆర్టిఐ ప్రెసిడెంట్-నూకపంగు వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్- కందుకూరు వంశీ క్రిష్ణ, వైస్ ప్రెసిడెంట్-మండవ వీరబాబు, జనరల్ సెక్రటరీ-మల్లెపంగు ఉపేందర్, జాయింట్ సెక్రెటరీ-కందుకూరి కృష్ణమూర్తి, ఆర్గనైజర్-షేక్ మీరా, కో ఆర్గనైజర్-కోల శ్రీను, కోఆర్డినేటర్-సిద్దెల రాజు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# ఘనంగా పోషణ్ పక్వాడ్



**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం నారాయణపురం లో పోషణ పక్వాడ్ లో కార్యక్రమంలో పాల్గొన్న సూపర్వైజర్ సునీత, టీచర్లు చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సునీత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల నుండి గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించనున్నట్లుగా తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# సెలవుల సరదా కారదు విషాదం

**ఏఎంసీ మాజీ చైర్మన్ పత్తిపాక సూచన**



**సాక్షి ఎండపల్లి:** వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఏఎంసీ మాజీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్ సూచించారు. సెలవుల సరదా నిర్లక్ష్యంగా మారితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా పిల్లలు వాగులు, చెరువులు, బావుల వద్దకు వెళ్లి ఈతకు దిగకుండా కట్టడి చేయాలని తెలిపారు. పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా ఉండటంతో అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. గ్రామాల్లో ప్రకటనలు, హెచ్చరికలు జారీ చేయడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచాలని సూచించారు. పిల్లలకు భద్రతా సూచనలు ఇవ్వడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొంటూ, తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని చిన్నారుల ప్రాణ భద్రతను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# వికారాబాద్ బస్ డిపో వద్ద భద్రతా ఏర్పాట్ల సమీక్ష



**నేటి సాక్షి,వికారాబాద్ :** టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె పిలుపునిచ్చిన నేపథ్యంలో వికారాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోను జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశమై బస్సుల రాకపోకలు మరియు డిపో వద్ద నెలకొన్న తాజా స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సమ్మె నేపథ్యంలో విధులకు హాజరయ్యే డ్రైవర్లు మరియు ఇతర సిబ్బంది ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి పోలీసు శాఖ తరపున పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా రవాణా వ్యవస్థకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా, ప్రభుత్వ ఆస్తులైన బస్సులకు నష్టం కలిగించినా సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి ఆందోళనలకు దిగేవారిపై, విధులను అడ్డుకొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మూడు డిపోలలో ప్రస్తుతం పరిస్థితి శాంతియుతంగానే ఉందని, విధులకు హాజరయ్యేందుకు ఆసక్తి ఉన్న డ్రైవర్లు నిర్భయంగా రావాలని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రవాణా సౌకర్యాలు కొనసాగేలా చూడటమే తమ మొదటి ప్రాధాన్యతని ఎస్పీ స్నేహ మెహ్రా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఐడీఓసీ జగిత్యాలలో భగీరథ మహర్షి జయంతి



- అదనపు కలెక్టర్ బిఎస్ లత
- భగీరథ మహర్షి సేవలు సమాజానికి ఆదర్శం
- మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి
- ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి వేడుకలు

**నేటి సాక్షి, జగిత్యాల (పూరెళ్ల బాపు):** ఐడీఓసీ జగిత్యాల భగీరథ మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రెవిన్యూ అదనపు కలెక్టర్ బిఎస్ లత భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ, సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయుడయ్యారని కొనియాడారు. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం వారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారిణి జి సునీత, కలెక్టరేట్ ఏవో కిషన్, వివిధ జిల్లా అధికారులు, అధికారులు, సంఘ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమ పథకాలు

- జిల్లా నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి




**నేటి సాక్షి,నారాయణపేట( ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదలకు చేరువవుతున్నాయని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మరికల్ మండల కేంద్రంలోని నాలుగో వార్డులో రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మరికల్ గ్రామ సర్పంచ్ చెన్నయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందని, ఈ పథకాలు ప్రస్తుతం ప్రతి గ్రామంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయని వివరించారు. నిరుపేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన కొనియాడారు. బీసీ కాలనీలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను నాణ్యతతో, వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మరికల్ గ్రామ ఉపసర్పంచ్ కటికే కాజా, వార్డు సభ్యులు చంద్రకళ, వసంత, రాజేశ్వరి, లక్ష్మి, రాధా, రామేశ్వరమ్మ, మరియు నాయకులు పండ్ల చంద్రశేఖర్, హరీష్ కుమార్, రామకృష్ణ, నాగరాజు, అశోక్, రఘు, గోవర్ధన్, రాజు, కుర్మయ్య, మల్లేష్, సీమ గోపాల్, పి. అశోక్, ల్యాబ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి





- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ బస్ డిపో ఎదురుగ సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపిన వికారాబాద్ జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి.కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం.గతంలో కెసిఆర్ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే దానిని ఇప్పటిదాకా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుంది.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి.ఆర్టీసీ కార్మికులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలనే కార్మికులు అడుగుతున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా డ్రైవర్ కండక్టర్ల మీద తీవ్రంగా ఒత్తిడి పెరిగింది. కార్మికుల సమ్మెతో కాంట్రాక్ట్ డ్రైవర్లను తీసుకుని ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా మార్చింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. మరి తెలంగాణలో ఎందుకు ఆలస్యం జరుగుతుంది?

ఆర్టీసీ సమ్మెతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చి సమ్మె విరమింప చేయాలి.

బీ ఆర్ ఎస్ పార్టీ తరుపున ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా ఉంటామన్నారు. ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపిన వికారాబాద్ జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గారితో పాటు బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులను అరెస్ట్ చేసి ధారుర్ పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ వికారాబాద్ నియోజకవర్గ దీ=ూ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సూర్య గ్లోబల్ స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు




**నేటి సాక్షి ,జగిత్యాల (పూరెల్ల బాపు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని సూర్య గ్లోబల్ పాఠశాలలో "కలోత్సవ్ 2ఖ26" పేరుతో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ, దేశభక్తి నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా నరసింహ అవతారం, శివతాండవం, దాండియా నృత్యం, అమ్మ–నాన్న గొప్పతనాన్ని ప్రతిబింబించే నృత్యం, ఆర్మీ థీమ్‌తో చేసిన ప్రదర్శనలు, అలాగే విభిన్న పాత్రలతో కూడిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీధర్ రావు మాట్లాడుతూ చిన్నారులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, హ్యాండ్‌రైటింగ్ స్కిల్స్, స్పీకింగ్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని చెప్పారు. ప్రతి పండుగను ఘనంగా నిర్వహిస్తూ విద్యార్థులలో సాంస్కృతిక విలువలను పెంపొందించడం పాఠశాల లక్ష్యమని వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాల విజయవంతానికి విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన సహకారం ఎంతో గొప్పదని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ జోగినిపల్లి రమాదేవి, డైరెక్టర్లు హరి చరణ్ రావు, మౌనిక రావు, రజిత, హరిచరణ్ సుమన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

- మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ సీనియర్ నేత జువ్వాడి కృష్ణారావు హాజరు
- ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన వస్త్రాల అందజేత




**నేటి సాక్షి కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని భీమునిదుబ్బ ప్రాంతానికి చెందిన అగ్గరాజు లక్మిరాజం, అగ్గ సుజాత రాజేశం కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికాగా, గురువారం నిర్వహించిన గృహప్రవేశ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు హాజరై కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఇల్లు లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందజేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, రేంజర్ల కళ్యాణి, యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, నాయకులు చెట్పల్లి రంజిత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# చిట్రెడ్డిపల్లి సమీపంలో రైతుల ఆగ్రహం




- విద్యుత్ శాఖపై సింగల్ విండో చైర్మన్ హరి ప్రసాద్ నిలదీత

**నేటి సాక్షి,చౌడేపలి:** చౌడేపల్లి మండలం చిట్రెడ్డిపల్లి సమీపంలో విద్యుత్ సమస్యలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగల్ విండో చైర్మన్ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో రైతులు విద్యుత్ శాఖ అధికారులను నిలదీశారు. వివరాల్లోకి వెళితే, కొంతమంది రైతులు వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం డబ్బులు చెల్లించి, అర్జీల రూపంలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)ను సంప్రదించినప్పటికీ తమకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు కార్యాలయాన్ని సంప్రదించినా సమస్య పరిష్కారం కాలేదని వారు తెలిపారు. ఇక మరికొందరు రైతులు బోర్లు ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా అందకపోవడంతో తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. పంటల సాగు దెబ్బతింటోందని, ఇలాంటి పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అయితే, కొన్ని చోట్ల బోర్లు వేయకపోయినా అధికారాన్ని అడ్డం పెట్టుకొని విద్యుత్ సర్వీసులు పొందడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపణలు వినిపించాయి. ఈ విషయంపై స్పందించిన సింగల్ విండో చైర్మన్ హరి ప్రసాద్, "నియమాలు అందరికీ ఒకే విధంగా ఉండాలి. ఎవరికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం అన్యాయం" అని పేర్కొన్నారు. ఏ నిబంధనల ప్రకారం ఇలాంటి కనెక్షన్లు ఇచ్చారో వెల్లడించాలని విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్పందించిన విద్యుత్ శాఖ అధికారి, "గతంలో నేను బాధ్యతలు స్వీకరించే ముందు కొన్ని కనెక్షన్లు ఈ విధంగా ఇచ్చి ఉండవచ్చు. వాటిని సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. అలాగే, ప్రస్తుతం ముగ్గురు రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులకు అంచనాలు (ఎస్టిమేట్) సిద్ధం చేసినట్లు చెప్పారు. సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనతో చౌడేపల్లి మండలంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా వ్యవస్థపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు




- కార్మికులతో కలిసి నిరసనలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్
- కార్మికుల సమస్యలు న్యాయమైనవే
- ప్రభుత్వం వెంటనే స్పందించాలి

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ తరపున కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గురువారం కార్మికులను కలిసి వారి సమ్మెలో పాల్గొన్నారు. కార్మికుల సమస్యలు పూర్తిగా న్యాయమైనవేనని, ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమ్మె శిబిరాలను సందర్శించిన ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నిరసన కార్యక్రమంలో పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కార్మికుల పక్షానే నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని, కానీ చేతలు మాత్రం గడప కూడా దాటడం లేదని తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలకు హామీలు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని, కానీ అమలులో మాత్రం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి జీవో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం అపాయింట్మెంట్ ఇస్తే ఆ ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ కార్మికుల సమస్యలపై కనీస స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. జీవో గెజిట్ ఇచ్చి కూడా అపాయింట్మెంట్ ఇవ్వడానికి ముఖ్యమంత్రి వద్ద సమయం లేకపోవడం విచారకరమని అన్నారు. నిరసనలు వ్యక్తం చేస్తున్న కార్మికులపై కేసులు నమోదు చేయడం, ధర్నా చేస్తున్న వారికి టెంట్లు కూడా ఏర్పాటు చేయనివ్వకపోవడం అన్యాయమని ఎమ్మెల్యే మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అణచివేయాలని చూడడం తగదన్నారు. ఆర్టీసీ కార్మికులకు 100 శాతం న్యాయం జరిగే వరకు తాను వారి పక్షాన పోరాటం కొనసాగిస్తానని ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ స్పష్టం చేశారు. దీంతో సమ్మెలో ఉన్న కార్మికులకు మరింత ధైర్యం, ఉత్సాహం లభించింది.

# బాల్య వివాహాలపై అవగాహన

**పిఓఐసి రాములమ్మ**



**నేటి సాక్షి, చౌడేపల్లి:** బాల్య వివాహాలు సమాజానికి తీవ్రమైన అనర్థాలను కలిగిస్తాయని పిఓఐసి రాములమ్మ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తల కోసం బాల్య వివాహాల నివారణ, చిన్న వయసులో గర్భధారణ వల్ల కలిగే సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నతనంలోనే గర్భం దాల్చడం వల్ల తల్లి, శిశువు ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలు ఉంటాయని పేర్కొన్నారు. సరైన వయస్సుకు ముందే వివాహాలు జరగడం వల్ల మహిళలు భవిష్యత్తులో అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. చట్టాలపై అవగాహన కలిగి, బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. అలాగే సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, వారికి విద్య, ఆరోగ్య పరిరక్షణ అత్యవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సులోచన, రాధమ్మలు, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ కొత్త కమిటీలు

**యువజన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేష్**



**నేటి సాక్షి, జగిత్యాల(పూరెల్ల బాపు):** జగిత్యాల్ జిల్లా కేంద్రంలో గురువారం రోజున ఉదయం మోతే రోడ్ లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ ఆఫీస్ లో జగిత్యాల్ నియోజకవర్గ స్థాయి యువజన కాంగ్రెస్ సమావేశం జిల్లా యూత్ కాంగ్రెస్ అద్యక్షుడు బీరం రాజేష్ గారి అధ్యక్షతన ఏర్పాటు చేయడం చేయడం జరిగింది గ్రామ గ్రామాన యువజన కాంగ్రెస్ కమిటీలు వేసి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేద్దాం, రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపియడానికి యువజన కాంగ్రెస్ తోడ్పడలని సూచన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షుడు బీరం రాజేష్ ,జిల్లా వైస్ ప్రెసిడెంట్ సాయి ,అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కర్నె భూమరెడ్డి, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బోదసు జలపతి , సారంగపూర్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ,జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బొద్దుల శివ కుమార్, మండల్ యూత్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ ప్రహ్లాద హరీష్ ,పురుషోత్తం , ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ మహాధర్నా

**జయప్రదం చేయండి**



**నేటిసాక్షి, తిరుమలాయపాలెం(రుద్రరాజు):** రైతులకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ అధ్యక్షులు తాత మధుసూదన్ లా పిలుపుమేరకు 24వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుంది రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి మొక్కజొన్న పంటలను తక్షణం కొనుగోలు చేయాలని రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరిని నిరాశిస్తూ ఈ మహాధర్నను నిర్వహించబడుతుంది కావున తిరుమలాయపాలెం మండలంలోని 40 గ్రామపంచాయతీ గ్రామాల నుండి నాయకులు, కార్యకర్తలు, రైతులు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు ,మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లు పార్టీ సీనియర్ నాయకులు అందరూ తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ తిరుమలాయపాలెం మండలం అధ్యక్షుడు భాష బోయిన వీరన్న కోరారు.

# భారీ దొంగతనం

**40 తులాలకు పైగా బంగారం,2 కిలోల వెండి వస్తువులతోపాటు రూ లక్ష 50 వేల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు**



**నేటిసాక్షి,మంచిర్యాల(శ్రీధర్ దమ్ము):** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గౌతమేశ్వర కాలనీలోని ఒక ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి భారీగా బంగారు, వెండి వస్తువులతో పాటు నగదు ను ఎత్తుకెళ్లారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని గౌతమేశ్వర కాలనీకి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ముదాం నాగన్న, అతని భార్య మూదం సుక్కమ్మలు బుధవారం రాత్రి రామారావు పేటలోని తమ బంధువుల ఇంట్లో గురువారం జరిగే దశదినకర్మకు వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని గురువారం రాత్రి 7 గంటల సమయంలో గౌతమేశ్వర కాలనీలోని తమ ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తలుపులు తెరిచి ఉండడంతో వారు నివేద పోయారు. ఇంట్లోకి వెళ్లి చూడగా మాస్టర్ బెడ్ రూమ్ లో ఉన్న బీరువా తలుపులు పగలగొట్టి కనిపించాయి. బెడ్ మీద బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. దీంతో బీరువా తలుపులు తెరిచి చూడగా బీరువాలో దాచిపెట్టిన 40 తులాలకు పైగా బంగారు ఆభరణాలు, 2 కిలోల విలువచేసే వెండి వస్తువులతో పాటు రూ లక్ష 50 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దొంగతనం జరిగిన విషయాన్ని మంచిర్యాల పోలీసులకు తెలిపినట్లు బాధితులు మూదాం నాగన్న, మూదం సుక్కమ్మలు ఆవేదనగా తెలిపారు.

# కూలీలకు అన్ని వసతులు కల్పించాలి

**నల్లగొండ డిఆర్డిఓ శేఖర్ రెడ్డి**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ఉపాధిహామీ కూలీలు ఉదయం త్వరగా పనులకు వెళ్లి పని త్వరగా పూర్తి చేసుకొని తమ ఇండ్లకు వెళ్లాలని నల్లగొండ డిఆర్డిఓ శేఖర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలంలో నల్లగొండ డిఆర్డిఓ శేఖర్ రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని తాళ్ల వీరప్పగూడెం గ్రామపంచాయతీ, దామరచర్ల గ్రామపంచాయతీ మరియు కొండ్రపోలు గ్రామపంచాయతీలను సందర్శించారు. ఈ గ్రామాలలో ఉపాధి హామీ పనులు జరిగే చోటికి వెళ్లి కూలీలతో నేరుగా మాట్లాడి, ఆయా గ్రామాలలోని నర్సరీ పనులను, మరియు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధిహామీ కూలీలకు ఎండాకాలం దృష్టిలో ఉంచుకోని మంచినీళ్లు వసతి, టెంట్లు ఏర్పాటు మరియు ఫస్ట్ ఎయిడ్ కిట్ ను అందుబాటులో ఉంచాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలకు అందుబాటులో ఉంచాలని స్థానిక ఎంపీడీఓ, ఏపీఓ ను ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నర్సరీ పనులు జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించారు. ఎండాకాలం నందు ఉదయం 6 గంటలకు ఉపాధి పనులకు వచ్చి 11 గంటల వరకు పూర్తి చేసుకోని వెళ్ళవలని, ప్రతి గ్రామ పంచాయతీలోని అందరు కూలీలు ఉపాధి హామీ పనులను ఎక్కువ మొత్తంలో ఉపయోగించుకుని, ఈ ఎండాకాలంలో ఉపాధి హామీ సంబంధించిన డబ్బులు ఎక్కువ మొత్తంలో లబ్ధి పొందాలని సూచించారు. ఐకెపి కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర కల్పించాలని, రైతులను ఎటువంటి ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని, త్వరగా ధాన్యాన్ని ఎగుమతులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అలివేలు మంగమ్మ గారు, ఏపీఓ నాగేశ్వరావు, ఏపీఎం కృష్ణమూర్తి, తాలవీరప్పగూడెం గ్రామ సర్పంచ్ పోకల వెంకటేశ్వర్లు, ఈసీ శంకర్, టిఏ సైదా, వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు, దామరచర్ల మండలం ఫీల్డ్ అసిస్టెంట్లు, దామరచర్ల గ్రామపంచాయతీ ఉపాధి కూలీలు, మరియు వాడపల్లి గ్రామపంచాయతీ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం ఇచ్చిన సిఐటీయు నాయకులు**



**నేటి సాక్షి,మంచిర్యాల(శ్రీధర్ దమ్ము):** సిఐటియు ఆధ్వర్యంలో గురువారం రోజున క్యాతనపల్లి మున్సిపల్టిలో పనిచేస్తున్న మున్సిపాలిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సిఐటియు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ నందు పనిచేస్తున్న కార్మికులకు క్యాటగిర్లవారీగా వేతనాలు చెల్లించాలన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన మున్సిపల్ కార్మికులకు డబ్బులు చెల్లించాలన్నారు. అదే విదంగా పండగలకు సెలవు ఇవ్వాలని, 60 సం,,లు పైబడిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులందరికి ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. ఈ సంవత్సరాన్ని పరిష్కారం కొరకు ఈనెల 28న ఈ హైదరాబాద్ సిడిఎంఏ కార్యాలయం ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాసర్ల రాజలింగు మున్సిపల్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి, మున్సిపల్ యూనియన్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు, మున్సిపాలిటీ కార్మికులు దేవవరం, ఎల్లయ్య రాజు రవి నారాయన రమేష్ తిరుపతి పోశం విష్ణు గడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం

**ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి**



**నేటి సాక్షి గజ్వేల్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి ఆరోపించారు. సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటుగా విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారని, కానీ ఇప్పటివరకు ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదని అన్నారు. కేవలం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే అమలు చేశారని, మిగతా పథకాలన్నీ మాటలకే పరిమితమయ్యాయని తెలిపారు. ఆసరా పెన్షన్లు నిలిపివేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలాగే కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే పెళ్లి అయి పిల్లలు పుట్టే వరకు కూడా కళ్యాణ లక్ష్మి పథకం అందడం లేదని విమర్శించారు. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందడం లేదని, ఎరువులు, విత్తనాలు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. ఇక ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను కాపాడుకుంటామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు గడిచినా నెరవేర్చలేదని అన్నారు. ఇచ్చిన మాట తప్పడంతోనే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు టీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఐదు గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు







- **రైతులకు అండగా ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్**



**నేటి సాక్షి కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మండలంలోని రైతులకు ఊరటనిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పలు గ్రామాల్లో ఐకేపీ (IKP), ప్యాక్స్ (PACS) ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గురువారం కోరుట్ల మండలంలోని ధర్మారం, అయిలాపూర్, సర్వరాజ్‌పూర్, పైడిమడుగు, మదాపూర్ గ్రామాల్లో ఈ కేంద్రాలను ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు తమ ధాన్యాన్ని మధ్యవర్తుల చేతుల్లో కాకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. కేంద్రాల ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, తేమ శాతం, చెల్లింపుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, ఐకేపీ, ప్యాక్స్ నిర్వాహకులు, అధికారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే స్వయంగా కేంద్రాలను ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

- **రాష్ట్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన : బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** కాంగ్రెస్ ప్రభుత్వ అమల్లోకి తెచ్చిన యూరియా యాప్ ను రైతు ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో గురువారం ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసినట్లు తెలిపారు. చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తో పాటు మరో నలుగురు రైతులు దాఖలు చేసిన పిల్ పై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్ తో కూడిన ధర్మాసనం గురువారం విచారం చేపట్టింది. ఈ మేరకు 2 వారాల్లో సమగ్ర కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టులో పిటిషనర్స్ తరఫున పాశం రవీందర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు యూరియా యాప్ ద్వారా రైతులు యూరియా సప్లయి చేయడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 70 లక్షల మంది రైతులు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు.రైతుల్లో అధిక శాతం మంది నిరక్షరాస్యులు. వీరిలో చాలా మంది దగ్గర స్మార్ట్ ఫోన్స్ లేవు. కొద్ది మంది వద్ద స్మార్ట్ ఫోన్ ఉన్నా యూరియా యాప్ డౌన్ లోడ్ చేసుకొని ఫోన్లో యాప్ ద్వారా బుక్ చేసుకొనే పరిజ్ఞానం లేదు. దీనివల్ల రైతులంతా వ్యవసాయ అధికారులపై, ప్రయివేట్ నెట్ సెంటర్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఉన్నది.యూరియా యాప్ ద్వారా యూరియా బస్తాలు బుక్ చేయించుకోవాలంటే ఇతర సంస్థలపై రైతులు ఆధారపడి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. అంతేగాకుండా రైతులంతా వారి వ్యవసాయ పనులను వదిలిపెట్టి యూరియా బస్తాల కోసం క్యూ లైన్లలో నిలుచోవాల్సిన దుస్థితి నెలకొంది. యూరియా కోసం రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, ఎకరానికి కనీసం ఒక బస్తా ఒకేసారి వేయాల్సిన అవసరముందని, 10 ఎకరాలు ఉన్న రైతుకు యాప్ ద్వారా బుక్ అయినట్లయితే 7 బస్తాలు మాత్రమే ఇస్తున్నారని, దీనివల్ల మిగతా 3 ఎకరాలకు బస్తాలు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల తరువాత మిగతా బస్తాల కోసం యూరియా యాప్ ద్వారా బస్తాల కోసం బుక్ చేసుకున్నా ఒక బస్తా కూడా ఇవ్వడం లేదని, రెండో విడతగా కూడా యూరియా వేయాల్సిన అవసరం ఉన్నది. 15 రోజుల కాలవ్యవధి తర్వాత కూడా 5 -6 బస్తాలు కూడా దొరకని దుస్థితి ఉన్నది. ఈ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడానికి కౌలు రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సెకన్లలో స్టాక్ మాయమవుతున్నదని, అంతేగాకుండా కౌలు రైతులకు ఓటీపి చేప్పే లోపే స్టాక్ యమవుతున్నదని, కౌలు రైతులు యూరియా బస్తాలు పొందాలంటే రైతుల పాసు పుస్తకాలు సమర్పించాల్సి ఉంటుంది.అసైన్ ల్యాండ్ ఉన్న రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులంతా యూరియా యాప్ ను ఎత్తి వేయాల్సిందిగా ముక్తకంఠంతో కోరుతున్నారని అన్నారు. చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వెంట అంగోతు హాతీరాం నాయక్, మట్టపల్లి సైదులు, వేణుగోపాల్ రావు, పులి జగదీష్, హమీద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాలి



- **ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి - CITU**
- **సమ్మె చేస్తున్న జేఏసీ నాయకులతో సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలి**
- **ఆర్టీసీని ప్రైవేటికరణ చేస్తే ఊరుకోం**
- **RTC కార్మికుల సమ్మెకు CITU సంపూర్ణ మద్దతు - సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్**

**నేటిసాక్షి,మంచిర్యాల(శ్రీధర్ దమ్ము):** సీఐటీయు ఆధ్వర్యంలో గురువారం రోజున మంచిర్యాల ఆర్టీసీ డిపో వద్ద సమ్మె చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులకు సంఘిభావంగా తెలియచేస్తూ, ఆర్టీసీ సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ బస్టాండ్ ఎదుట నిరసన చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా లిసీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్‌లి మాట్లాడుతూ...కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోవడం చాలా దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించాలని పలు దాఫాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు ఇచ్చిన ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మె చేయడం జరుగుతుందన్నారు రాష్ట్ర కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసి బస్సులల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతి ఇచ్చింది.కాబట్టి పెరిగిన ప్రజల అవసరాల మేరకు ఆర్టీసి బస్ లు పెరుగుతాయని, దానికనుగుణంగా కార్మికుల సంఖ్య పెరుగుతుందని, కొత్త ఉద్యోగాలు వస్తాయని ఆశించాము.కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎం.వి.యాక్ట్-2019 మరియు విద్యుత్ బస్ ల విధానం వల్ల ఆర్టీసిలు తీవ్రమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. విద్యుత్ బస్ వల్ల ఆర్టీసిలు కనుమరుగై, ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలు మాత్రమే ఆర్టీసిలో మిగిలే పరిస్థితి వుంటుంది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ బస్ల పథకాలన్నీ కూడా గ్రాస్కాస్ట్ కాంట్రాక్ట్ (జిసిసి) పద్ధతిలో వుంటాయి. బస్ల కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్ అన్ని ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలే చూస్తాయి. ఆర్టీసిలకు ఎటువంటి పాత్ర వుండదు. ప్రతి నెలా ఆ విద్యుత్ బస్ల కంపెనీకి డబ్బులు చెల్లించడం మాత్రమే చేయాలి. అలాగే మౌలిక వసతుల కల్పన బాధ్యత మాత్రం ఆర్టీసి యాజమాన్యానిదే. హైదరాబాద్ నగర అనుభవం చూస్తే (పెంచిన మౌలిక వసతుల సెస్) రోజుకి సుమారు రూ.50 లక్షలు ప్రజలపై భారం పడ్తున్నది. ఇది భవిష్యత్లో మరింత పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్ విధానంలో మార్పుచేయాలి. జిసిసి పద్ధతిని రద్దు చేయాలి. ప్రైవేటు సంస్థలకు ఇస్తున్న అన్ని సబ్సిడీలను ఆర్టీసిలకు ఇవ్వాలి. ఆర్టీసిలే నేరుగా విద్యుత్ బస్లు సమకూర్చుకొనేందుకు అవకాశం ఇవ్వాలి. బడ్జెట్లో నిధులు కేటాయించాలి.ప్రజల అవసరాల మేరకు బస్ సంఖ్యను పెంచాలి. పిఎమ్ఎ డ్రైవ్ పథకంలో ఇస్తున్న సబ్సిడీని ఆర్టీసి చేసే 'రెట్రో ఫిట్మెంటు' బస్లకు కూడా వర్తింప చేయాలి. ఆర్టీసి కార్మికుల ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మె చేస్తున్న జేఏసీ నాయకులతో చర్చలు జరిపి సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంకె రవి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, సాంబారి వెంకటస్వామి జిల్లా సహాయ కార్యదర్శి, గోమాస ప్రకాష్ జిల్లా కమిటీ సభ్యులు, పసుల తిరుపతి మండల కన్వీనర్, చిందం వెంకటేష్, చిప్పకుర్తి కుమార్, బానేష్ తదితరులు పాల్గొన్నారు.